NE click
ePaper
www.shanmukhavelugu.com

షణ్ముఖ
SHANMUKHAVELUGU
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 259
శుక్రవారం 02 అక్టోబర్ 2026 పేజీలు 8 వెల : రూ.3
Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.



‘పల్లె’లు పరిఢవిల్లేలా..
ప్రగతి ‘పండగ’లా..

రామాపురంలో అట్టహాసంగా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం
చంద్రబాబు, పవన్‌కల్యాణ్, మాధవ్‌ల రాకతో జన కోలాహలం
జనసేన నేత బహూకరించిన కత్తి, గద, శంఖులను చూపుతూ...



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 01)

పల్లె పండగ సభ సాక్షిగా ఉదయగిరి నియోజకవర్గానికి సీఎం చంద్రబాబు వరాల జల్లు కురిపించారు. వరికుంటపాడు మండలం రామాపురంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరు అభివృద్ధిలో అంతర్జాతీయ ఖ్యాతి లభించడం గర్వకారణంగా ఉందని.. కృష్ణపట్నం-రామాయపట్నం పోర్టుల మధ్య దగదర్తి విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. రైలు, రోడ్డు కనెక్టివిటీని పెంచి నెల్లూరు-ప్రకాశం జిల్లాలను లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. బీపీసీఎల్ ప్లాంట్ ద్వారా రూ.లక్ష కోట్ల పెట్టుబడులు రానున్నాయని, డిఫెన్స్ పరిశ్రమలు కూడా ఈ ప్రాంతానికి వస్తున్నాయని.. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన నెల్లూరు, ఉదయగిరి వాసులు ఇక్కడి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సభాప్రాంగణం.. ర్యాంప్‌వాక్.. గ్రామాల్లో అభివృద్ధి పనులపై చిత్రాలు.. ఏర్పాట్లు ఆకట్టుకున్నాయి. చంద్రబాబు, పవన్, మాధవ్ వేదిక మీదకు రాగానే సభికుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది.



శిలాఫలకం వద్ద చంద్రబాబు, పవన్, మాధవ్, నారాయణ తదితరులు

పవన్‌కల్యాణ్ ప్రసంగంలో...

ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా గతంలో నిలిచిపోయిన సుజల స్రవంతి పథకం ద్వారా రూ.52 కోట్లతో దుత్తలూరు, జలదంకి, కలిగిరి, కొండాపురం, సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు మండలాల్లో 381 పనులు చేపట్టబోతున్నాం.

ఉదయగిరి కోటకు చేరుకునే సుమారు 4 కి.మీ. రహదారి నిర్మాణానికి రూ.2.5కోట్లు మంజూరు చేస్తున్నాం.

ఉదయగిరి కోటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసి, స్వదేశీ దర్శన్, సాస్కి పథకాల కింద నిధులు సమకూర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

ఉదయగిరి కొండను హెరిటేజ్ టూరిజంతో పాటు ఎకో టూరిజంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

ఉదయగిరిలో ఇప్పటికే క్రాఫ్ట్ ఉడ్ బ్యాంకు ఏర్పాటు చేసి, వేప, బిక్కి, కల్వి, పాలబర్కలాంటి చెక్కలను అందుబాటులోకి తీసుకొచ్చాం. చెక్క స్పూన్లు, గిన్నెలు, బొమ్మల తయారీలో ప్రసిద్ధి చెందిన స్థానిక కళాకారులకు ఇది ఎంతో ఉపయోగం. ఉత్పత్తులను తయారు చేసుకునేందుకు సొసైటీ భవనాలకు మరమ్మతు పనులు చేపడుతున్నాం. త్వరలో శాశ్వత భవనాలు నిర్మిస్తాం.

గజ్జెలపల్లి పాఠశాల విద్యార్థుల విజ్ఞప్తి మేరకు రహదారి పనులు పూర్తి చేశాం.

కావలి నియోజకవర్గంలో గోగులపల్లి ప్రజలు తమ ఉప్పు ఉత్పత్తులను రవాణా చేసుకునేందుకు రహదారి నిర్మించాలని కోరగా రూ.3.5 కోట్లతో రహదారిని నిర్మించేందుకు త్వరలో పనులు ప్రారంభిస్తామని పవన్‌కల్యాణ్ తెలిపారు.

జగన్ వన్ టూ వన్...
డీప్ డిస్కషన్స్...
వెరీ సీరియస్ !



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 01)

వైసీపీ అధినేత వైఎస్ జగన్ స్థానిక ఎన్నికల విషయంలో వెరీ సీరియస్ గా ఉన్నారు. ఆ విషయం పార్టీ వారికి కూడా మెల్లగా అర్థం అవుతోంది. స్థానిక ఎన్నికలలో ఎటూ అధికార పార్టీకే మొగ్గు ఉంటుంది కదా అని భావించి ప్రతిపక్షం పెద్దగా సీన్ లోకి రాదు అని గతంలో ప్రచారం సాగింది. అయితే అనూహ్యంగా వైసీపీ దూసుకుని వస్తోంది. అంతే కాదు లోకల్ బాడీ ఎన్నికల్లో అమీ తుమీ తేల్చుకోవాలని అనుకుంటోంది. రెండేళ్లకే కూటమి పాలన మీద జనంలో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని వైసీపీ అధినాయకత్వం అభిప్రాయంగా ఉంది. అంతే కాదు కూటమిలో లుకలుకలు ఉన్నాయని గ్రౌండ్ లెవెల్ లో కో ఆర్డినేషన్ పెద్దగా ఉండకపోవచ్చని అన్నీ అనుకూలిస్తే కనుక గుర్రం ఎగరావచ్చు అన్నట్లుగా వైసీపీ రాజకీయ దశ తిరగావచ్చు అన్నదే ఆ పార్టీ పెద్దల ఆలోచనగా కనిపిస్తోంది.

ముఖా ముఖీకి : వైసీపీ అధినేత జగన్ ముఖా ముఖీ చర్చలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇప్పటిదాకా పార్టీ నేతలను పిలిచి వారితో సమావేశాలు నిర్వహించి పార్టీ విధానాల గురించి చెబుతూ ఎలా వ్యవహరించాలి అన్నది దిశా నిర్దేశం చేసేవారు. అయితే ఈసారి మాత్రం ముఖా ముఖీ గా భేటీలు ఉంటాయని తెలుస్తోంది. ▶2లో

లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ: ప్రధాని మోదీ



యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ
స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 01)

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు ‘100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్’ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ▶మిగతా 2లో

మాకు అధికారమిస్తే...
డ్రగ్స్ రహితంగా పంజాబ్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 01)

భారతీయ జనతా పార్టీ(భాజపా)కు ఒక్క అవకాశం ఇస్తే.. 2029 డిసెంబరు 31 నాటికి పంజాబ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీనిచ్చారు. ‘నషా ముక్త్ పంజాబ్’ లక్ష్యంగా.. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడతామని ప్రకటించారు. బుధవారం పంజాబ్‌లో పర్యటించిన ఆయన ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వం మత్తు పదార్థాలను రాష్ట్రంలో స్వేచ్ఛగా విక్రయించే వీలు కల్పించిందని దుయ్యబట్టారు. ఈశాన్య రాష్ట్రాలతోపాటు, కశ్మీర్‌లోనూ నక్సలిజం, టెర్రరిజాన్ని నిర్మూలించామని, ఒక్క అవకాశమిస్తే..పంజాబ్‌నూ మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా మారుస్తామని తెలిపారు. ఈ మేరకు జలంధర్‌లోని పరగ్‌పుర్‌లో బుధవారం జరిగిన ‘నషా ముక్త్ పంజాబ్ యాత్ర’లో అమిత్ షా వెల్లడించారు.

నెల రోజుల్లో డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదలకు చర్యలు: మంత్రి లోకేశ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 01)

నెల రోజుల్లో డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదల చేయడానికి ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ (ష్రీతీఱ్ఱ వూశీఎవంష్ట్ర) అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష నిర్వహించారు. నోటిఫికేషన్ విడుదల నుంచి అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చే వరకు ప్రతి దశలోనూ పూర్తి పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలన్నారు. దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ రిక్రూట్ మెంట్ మోడల్‌ను ఆసక్తిగా గమనిస్తోంది, మనం అనుసరిస్తున్న విధానాలనే ఇతర రాష్ట్రాలు అనుసరించే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా ‘మిషన్ మార్చ్’ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల పరిధిలో 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. దీనిపై ఉన్నత విద్య డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా స్పందిస్తూ... అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ప్రక్రియ పూర్తయిందని, డిసెంబర్‌లో రాత పరీక్ష నిర్వహణకు ఏపీపీఎస్సీ ఏర్పాట్లుచేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో క్యాంపస్‌ల ఏర్పాటుకు జేఎన్‌ఎస్ యూనివర్సిటీ, థాపర్ యూనివర్సిటీ, యూపీఈఎస్, జేయూఎస్ యూనివర్సిటీ, బెన్నెట్ యూనివర్సిటీ, సవిత యూనివర్సిటీ వంటివి ఆసక్తి చూపుతున్నాయని అధికారులు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థల క్యాంపస్‌ల ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తించాలని, త్వరితగతిన నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

సంతరావురులో బిన్ బ్యాగ్ పై అవగాహన కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, అక్టోబర్ 1) మండలంలోని సంతరావురు గ్రామంలో గురువారం ఎంపిడిఓ కె ధనలక్ష్మి అధ్వర్యంలో బిన్ బ్యాగ్ సిస్టం పైన డోర్ టు డోర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛత హీసేవ కార్యక్రమంలో భాగంగా షేడ్ దగ్గర మొక్కలు నాటారు.ఇ సందర్భంగా ఎంపిడిఓ ధనలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఎంపిడిఓ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ధనలక్ష్మి, కృపారావు, యార్లగడ్డ లక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

కడవకుదురులో వైద్య శిబిరం



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, అక్టోబర్ 1) మండలంలోని సంతరావురు ఆరోగ్య పరిధిలోని కడవకుదురు గ్రామంలో గురువారం వైద్యాధికారి కె కీర్తి సరోజ్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన వారికి వైద్య పరోక్షలు నిర్వహించి, వైద్య సూచనలు అందించారు. అవసరం అయినా వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కీర్తి సరోజ్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలు, పాటించవలసిన జాగ్రత్తల పై కె కీర్తి సరోజ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కీర్తి సరోజ్, 104డిఇఓ పోదిలి రాఘవ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గురు మాతాజీకి పుష్పాంజలి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, అక్టోబర్ 1) పూజ్య శ్రీశ్రీశ్రీ విశుద్దానంద భారతి మా గురు మాతాజీ గురువారం తెల్లవారుజామున శివైక్యం చెందారు. ఈ సందర్భంగా సాయిబాబా దేవస్థానంలో గురువారం గురు మాతాజీ చిత్ర పటానికి భక్తులు పూల మాలలు వేసి పుష్పాంజలి ఘటించారు.శ్రీ షిరిడి సాయినాథుని తత్వం ప్రచారంలో భాగంగా దేశ విదేశాల్లో దశాబ్దాలుగా శ్రీ సాయి సచ్చరిత్ర పారాయణం గురు మాతాజీ విస్తృతంగా చేశారని, గూడూరు దత్త పీఠం నిర్వహిస్తున్నారని కమిటీ సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ గౌరవ అధ్యక్షులు బోయిళ్ళ తిరుపతిరెడ్డి, ముక్కు నర్సారెడ్డి, సద్గురు సాయి సేవా సమితి అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం, దేవస్థానం కమిటీ అధ్యక్షులు కొప్పరపు సత్యాలు, కార్యదర్శి బాలు ఓబులురెడ్డి, కోశాధికారి ముచ్చర్ల థర్మారావు, సంయుక్త కోశాధికారి వాగిచెర్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు నార్లపాటి సాంబశివరావు, వీసి రామశాస్త్రి, తంగుటూరి గోవిందరావు, సింగరాజు మాలకొండేశ్వరరావు, ఏసీ చెంచులు, కమిటీ సభ్యులు రాచమడుగు సంజీవయ్య, టివి కృష్ణారెడ్డి, ఒంటేరు పెద్దన్న, గాదంశెట్టి ప్రసాద్, సాయి మహిళా సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ కమిటీ పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, అక్టోబర్ 1) ఎస్ఎంసీ కమిటీ సభ్యులు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకరించాలని పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మి అన్నారు. గురువారం పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఎస్ఎంసీ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తున్నామని ఆమె అన్నారు. ఎస్ఎంసీ చైర్పర్సన్ కూడలి అరుణకుమారి, వైస్ చైర్పర్సన్ చీదెళ్ల కల్పన, పలువురు కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసీ కమిటీతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కలవా విజయలక్ష్మి ప్రమాణస్వీకారం చేయించారు. అలాగే నూతన కమిటీని తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఎంశ్రీ జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు నాగ పద్మజ, గోపవరపు సుబ్బారెడ్డి, కోలికి రమణయ్య, గోపి, ఏవి నారాయణ, యాలం శ్రీను, లక్ష్మి, రషీద, కోటేశ్వరి, అలివేలు, భాగ్యలక్ష్మి, భాగ్యరేఖ, అనురాధ, పద్మశ్రీ, రమా, మనీషా, ప్రసాద్, చంద్ర, పీఈటీలు నందిని, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

‘పల్లె’లు పరిఢవిల్లేలా..

ప్రగతి ‘పండగ’లా..

ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, మహిళా కార్యకర్తల జోష్

ఉదయగిరికి సీఎం వరాలు

పెద్దిరెడ్డిపల్లె రిజర్వాయర్ కాల్వ పనులకు రూ.52 కోట్లు మంజూరు చేస్తున్నాం.

సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-1 నిర్మాణానికి అవసరమైన రూ.85 కోట్లు అందిస్తాం.

డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌కు అవసరమైన క్లియరెన్స్‌లు మంజూరు చేస్తాం.

సీబీజీ ప్లాంట్‌కు నిరంతర విద్యుత్తు సరఫరాకు సహకరిస్తాం.

సోమశిల డ్యామ్ భద్రతకు అవసరమైన నిధులు సమకూరుస్తాం.

క్రాకటూరు డిస్ట్రిబ్యూటరీకి నిధులు సమకూర్చడంతో పాటు వింజమూరు ప్రాంత పరిధిలో తాగు, సాగునీటి అవసరాల కోసం రాజవోలు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేస్తాం.

కనిగిరి ప్రాంతంలో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి వీబీజీ రామ్‌జీ గ్రాంట్ అందిస్తాం.

రాళ్లపాడు రిజర్వాయర్ ద్వారా వలేటివారిపాలెం, గూడూరు, లింగసముద్రం మండలాల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం.

కనిగిరి-బల్లిపల్లె వద్ద ట్రిపుల్ఐటీ ఏర్పాటుకు సహకరిస్తాం.

హెలిప్యాడ్ వద్ద అభిమానుల కేరింతలు

హెలికాప్టర్ నుంచి దిగి వస్తున్న సీఎం

వింజమూరు : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వరికుంటపాడు మండలంలోని రామాపురంలో మంగళవారం హెలిప్యాడ్ వద్ద అభిమానులు ఘన స్వాగతం పలికారు. హెలికాప్టర్ రాగానే ఈలలు వేస్తూ సందడి చేశారు. మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండ్ కాగా ఉప ముఖ్యమంత్రి హెలికాప్టర్ 20 నిమిషాల తర్వాత వచ్చింది. వీరు ప్రజలకు అభివాదం చేస్తూ వెళ్లారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, నిమ్మల రామానాయుడు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రశాంతిరెడ్డి, కాకర్ల సురేష్, దగుమాటి కృష్ణారెడ్డి, కలెక్టర్ హిమాన్షుశుక్లా, ఎస్పీ అజిత వేజెండ్ల తదితరులు ఎదురెళ్లి స్వాగతం పలికారు. సాయంత్రం అయిదు గంటల సమయంలో రెండు హెలికాప్టర్లు వెనుదిరిగాయి.

అభిమానుల కోలాహలం

కార్యక్రమం విజయవంతం

పల్లె పండగ 3.0 కార్యక్రమం విజయవంతమైంది. ఈసభకు నెల్లూరు, ఉమ్మడి ప్రకాశం, కడప జిల్లాల నుంచి భారీ సంఖ్యలో కూటమి నాయకులు కార్యకర్తలు, మహిళలు అధికసంఖ్యలో తరలిరావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసింది. ఎండను సైతం లెక్క చేయకుండా ఆయా పార్టీల అభిమానులు జెండాలు చేతబట్టి నినాదాలు చేస్తూ సభ వద్దకు చేరుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, భాజపా రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ర్యాంప్‌పై నడుస్తూ ప్రజలకు అభివాదం చేశారు. చంద్రబాబు ప్రసంగిస్తుండగా ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది.

మహిళల ఉత్సాహం

జగన్ వన్ టూ వన్...డీప్ డిస్కషన్స్... వెరీ సీరియస్ !

ఏపీ హైకోర్టు కీలక తీర్పులు వెలువరించిన తరుణంలో వైసీపీ నిర్వహిస్తున్న పార్టీ నేతల సమావేశం దానితో పాటు వన్ టూ వన్ గా జగన్ నాయకులతో భేటీ అవుతారు అన్న వార్తలు అయితే రాజకీయంగా వేడి పుట్టిస్తున్నాయి. జిల్లా అధ్యక్షులు రీజనల్ కో ఆర్డినేటర్లను జగన్ తాడేపల్లి కేంద్ర కార్యాలయానికి పిలిపించి మరీ ఈ భేటీలు వేస్తున్నారు.

గ్రౌండ్ లెవెల్ రియాలిటీ : జగన్ వన్ టూ వన్ భేటీల వెనక గ్రౌండ్ లెవెల్ రియాలిటీని తెలుసుకునే ఆలోచనలు ఉన్నాయని అంటున్నారు. ముఖ్యంగా చూస్తే పంచాయతీ వార్డు మెంబర్ నుంచి మేయర్, జెడ్పీ చైర్మన్ అభ్యర్థి వరకూ వైసీపీకి అన్నీ చర్చకు వస్తాయని అంటున్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ క్షేత్ర స్థాయిలో పార్టీ బలాబలాలను అంచనా వేయడం అలాగే ఆశావహులను గుర్తిస్తూ పార్టీ నేతలు తయారు చేసిన నివేదికలను కూడా పరిశీలించడం వంటివి ఉంటాయని అంటున్నారు. ప్రతీ సీటుకూ పోటీ కోసం ముగ్గురు ఆశావహులతో షార్ట్ లిస్ట్ ప్రిపేర్ చేయాలని వైసీపీ హైకమాండ్ ఆదేశించింది. దాని ప్రకారం ఆ ముగ్గురి నుంచి ఒక్కరిని కీలక పదవి కోసం పోటీకి ఎంపిక చేస్తారు అని అంటున్నారు.

లోతుల్లోకి వెళ్తూనే :ప్రతీ గ్రామ పంచాయతీ అలాగే ఎంపీటీసీలు జెడ్పీటీసీల పరిధిలో ఏమి జరుగుతోంది, కూటమి పార్టీల బలం ఎంత అన్నది కూడా ఈ సందర్భంగా చర్చిస్తారు అని అంటున్నారు. అలాగే అక్కడ సామాజిక రాజకీయ పరిస్థితులను కూడా ఆకలింపు చేసుకుంటూ ముందుకు సాగుతారని తెలుస్తోంది. మరో వైపు చూస్తే బీసీ రిజర్వేషన్ల మీద ప్రభుత్వం ఇచ్చిన రెండు జీవోలను కోర్టు కొట్టేసిన నేపథ్యంలో పార్టీ పరంగా బీసీలకు ప్రాధాన్యత ఇచ్చే విషయం మీద కూడా వైసీపీ చర్చిస్తుందని అంటున్నారు.

లైట్ తీసుకోవద్దనే :స్థానిక సంస్థల ఎన్నికలను లైట్ తీసుకోవద్దనే జగన్ పదే పదే చెబుతున్నారు. అధికార పార్టీ అన్ని విధాలుగా బలగాలతో వచ్చినా ధీటుగా ఎదుర్కోవాల్సిందే అని జగన్ సందేశం ఇస్తున్నారు. అంతే కాదు, ఈ ఎన్నికలు పార్టీ శ్రేణులలో నూతన ఉత్సాహాన్ని తీసుకుని వస్తాయని చెబుతున్నారు. గట్టిగా కసిగా కూటమి మీద పోరాడడం అన్నది గ్రాస్ రూట్ లెవెల్ నుంచి నియోజకవర్గం వరకూ క్యాడర్ లో పెరిగితే అది భవిష్యత్తులో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కూడా భారీ రాజకీయ ప్రయోజనాన్ని చేకూరుస్తుందన్నది అధినాయకత్వం వ్యూహంగా ఉంది. మొత్తం మీద చూస్తే పార్టీ నేతలతో జగన్ జరిపే వన్ టూ వన్ లో భేటీలు అయితే ఆసక్తిని పెంచుతున్నాయి.

లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ: ప్రధాని మోదీ

ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్ఛర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. “నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు” అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు.

యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. “ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేదుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు” అని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. “1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. అనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన ‘ఉక్కు చట్రాన్ని’ (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు” అని మోదీ వివరించారు.

1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి.

సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

అనునిత్యం ప్రజల కోసం పనిచేసే మమ్మల్ని ఆశీర్వదించండి

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, అక్టోబర్ 1) అను నిత్యం ప్రజల కోసం పని చేసే మమ్మల్ని ఆశీర్వదించాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కోరారు. మార్కాపురం పట్టణంలోని 31వ వార్డులో రాజ్యలక్ష్మి కాలనీలో గురువారం సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వయంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పెన్షన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్ళి వారి చేతికి పెన్షన్ డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తమ ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం 31వ వార్డులో హెచ్ఏఎం ద్వారా మార్కాపురం మున్సిపాలిటీకి మంజూరైన రూ.35 కోట్ల రూపాయల సీసీ రోడ్లలో భాగంగా గురువారం 31వ వార్డులో పలు సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా 31వ వార్డులో సందడి వాతావరణం నెలకొంది. అనంతరం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం లాగా 3000 రూపాయల పెన్షన్ ఇస్తామని చెప్పి వృద్ధులను వికలాంగులను వితంతువులను నయవంచన చేసి నాలుగు సంవత్సరాల తర్వాత 3000 రూపాయలు పెన్షన్ ఇచ్చారని కానీ ఇచ్చిన మాట కట్టుబడి ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.4,000ల పెన్షన్ ఇచ్చామని తమ ప్రభుత్వం మాట చెబితే ఆ మాట కట్టుబడి పని చేస్తామని అబద్దాలాడి ప్రజలను మోసం చేయటం ఒక వైసీపీకే చెల్లిందని అన్నారు. ఇక మార్కాపురం పట్టణంలో నూవీ ద్వారా మంజూరైన రూ.35 కోట్ల రూపాయల నిధులను సీసీ రోడ్లకు మాత్రమే వెచ్చిస్తున్నామని వచ్చే ఐదారు నెలల్లో మార్కాపురం పట్టణంలోని ప్రతి రోడ్డును సీసీ రోడ్డుగా మారుస్తామని, అభివృద్ధికి చిరునామాగా మార్కాపురం పట్టణాన్ని మారుస్తామన్నారు. అనునిత్యం ప్రజల కోసం, ప్రజల మధ్యనే ఉంటూ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్న మమ్మల్ని ప్రజలు ఆశీర్వదించాలని తద్వారా మరిన్ని మంచి పనులు చేయడానికి వీలవుతుందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ తెలుగుదేశం నాయకులు, వార్డు తెలుగుదేశం నాయకులు, మున్సిపల్ అధికారులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.







రేపల్లెలో సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ఏలూరి

మంత్రులతో కలిసి సీఎంకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే

హార్టికల్చర్ స్టాల్‌ను సందర్శించిన సీఎం

పంటల సాగుపై వివరించిన ఏలూరి

హార్టికల్చర్ హబ్ తొలి దశలో పర్చూరుకు అవకాశం

సీఎంకు కృతజ్ఞతలు





(షణ్ముఖ వెలుగు, పర్చూరు, అక్టోబర్ 1) రేపల్లె పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కలిశారు. మంత్రులతో కలిసి ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్వాగతం పలికారు. అనంతరం సీఎం చంద్రబాబునాయుడు హార్టికల్చర్ స్టాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి పర్చూరు నియోజకవర్గంలో సాగవుతున్న వివిధ ఉద్యాన పంటలు, సాగు విధానాలు, రైతులకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రికి వివరించారు. హార్టికల్చర్ హబ్ తొలి దశలో పర్చూరు నియోజకవర్గానికి అవకాశం కల్పించినందుకు సీఎం చంద్రబాబుకు ఏలూరి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ఆయిల్‌పామ్, మిరప, కూరగాయలు, మామిడి తదితర పంటల సాగుకు ఉన్న అవకాశాలను వివరించారు. రైతుల అవసరాలు, ఉద్యాన రంగ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ముఖ్యమంత్రితో చర్చించినట్లు తెలిపారు. హార్టికల్చర్ హబ్‌తో పర్చూరు ప్రాంత రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, పంట అనంతర నిర్వహణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ తదితర రంగాల్లో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాల కోసం నియోజకవర్గానికి తొలి దశలో అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.


ప్రకాశం


మార్కాపురం


బాపట్ల


షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

02.10.26 శుక్రవారం

సర్వే నెం.634/ఏ లో అరాచకం

2024లో అక్కడ నిర్మాణాలు అక్రమం-ఇప్పుడు సక్రమం
చోద్యం చూస్తున్న అధికారులు
కనిగిరి రెవిన్యూ, మున్సిపల్ శాఖలో కల్లున్న కబోదుల్లా అధికారులు







(షణ్ముఖ వెలుగు, కనిగిరి, అక్టోబర్ 1)

కనిగిరిలోని పామూరు రోడ్డులో ప్లాట్ల ధరలు మహానగరాల్లోని ధరలను తలపిస్తున్నాయి. దీంతో పామూరు రోడ్డులో ఎలాగైనా స్థలాలు కబ్జా చేసి దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న సంకల్పంతో కొందరు అడ్డదారులు తొక్కుతూ డొంక పోరంబోకు భూముల్లో అక్రమ నిర్మాణాలను దర్జాగా చేపడతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వైకాపా నేతల చెరలో భూములు అన్న శీర్షికన ఓ విలేకరి కథనం ఇచ్చాడు. అప్పటి మున్సిపల్ కమిషనర్ టివి రంగారావు అక్రమ నిర్మాణాలను కూలగొట్టించారు. అయితే ఇప్పుడు అదే సర్వే నెంబర్‌లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా కనిగిరి రెవిన్యూ, మున్సిపల్ అధికారులు కల్లున్న కబోదుల్లా వ్యవహరిస్తూ ప్రజల్లో నానుతూ నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

వివరాల్లోకి వెళితే కనిగిరిలోని పామూరు రోడ్డులో సర్వే నెం. 634/ఏ డొంక పోరంబోకు భూమి. కనిగిరి-పామూరు ప్రధాన రోడ్డు ఫేసింగ్‌లో ఈ భూమి ఉంది. ఈ డొంకపోరంబోకు భూమి రూ.కోట్ల విలువ చేసే పరిస్థితి. ఈ భూమిని ఎలాగైనా కబ్జా చేసి అక్రమ నిర్మాణాలకు ఓ విలేకరి సుమారు 7 సెంట్ల స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టాడు. 2 నెలలుగా అక్రమ నిర్మాణం జరుగుతున్నా మున్సిపల్ కమిషనర్ అటువైపు వెళ్ళేందుకు సాహసించలేకపోతున్నారు. 2024లో అక్రమ నిర్మాణం అని కూలగొట్టిన మున్సిపల్ అధికారులు ఇప్పుడు డొంక పోరంబోకు భూమిలోని అక్రమ నిర్మాణాల గురించి పట్టించుకోని పరిస్థితి నెలకొంది. రెవిన్యూ, మున్సిపల్ అధికారులు ఒకరి పై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తూ అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సర్వే నెం. 634/ఏ లోని అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని మాచవరం కు చెందిన రైతు అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో హైకోర్టులో రిట్ పిటిషన్ నెంబర్ 14093/2026 తో కేసు నడుస్తుంది. అంతే గాక కనిగిరి ఆర్డీఓ కోర్టులో ఆర్‌సిడి/443/2026 నెంబరుతో కేసు విచారణ జరుగుతుంది. కానీ డొంక పోరంబోకు భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న తీరు అధికారుల అవినీతికి అద్దం పడుతుందనే విమర్శలున్నాయి. ఈ డొంక పోరంబోకు భూమిలో అక్రమ నిర్మాణం చేస్తున్న సదరు విలేకరికి అర్బన్ కాలనీలో సర్వే నెం. 201/సిలో ఎస్ నెం. 33తో ప్లాట్ నెం. 23 గతంలో రెవిన్యూ అధికారులు పట్టా ఇచ్చి ఉన్నారు. ఒక వ్యక్తికి ఒకే ఇంటి పట్టా ఇవ్వాలని చట్టం ఉన్నా ఆ వ్యక్తి కనిగిరిలో దర్జాగా సుమారు కోటి రూపాయలు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసినా మున్సిపల్, రెవిన్యూ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. కనిగిరి మున్సిపల్ పరిధిలో 2024లో కంభం రోడ్డు, పొదిలి రోడ్డులో కూడా అక్రమ నిర్మాణాలు తొలగించారు. కానీ 634/ఏలో అక్రమ నిర్మాణం జరుగుతుండడంతో పొదిలి, కంభం రోడ్లలో కూడా పడగొట్టిన నిర్మాణాల స్థలాల్లోనే మళ్లి అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు పలువురు సన్నద్ధమవుతున్నారు. కల్లున్న కబోదుల్లాగా వ్యవహరిస్తున్న రెవిన్యూ, మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి సర్వే నెం.634/ఏ లోని అక్రమ నిర్మానాలను అడ్డుకుని ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎవరికీ పట్టాలు ఇవ్వలేదు..... తహసీల్దార్

పామూరు రోడ్డులోని సర్వే నెం.634/ఏలో ఎవరికీ ఇంటి పట్టాలు ఇవ్వలేదని కనిగిరి తహశీల్దార్ కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ సర్వే నెంబర్ లో ఇంటిపట్టాలు ఇచ్చారా లేదా అన్న విషయమై ఆర్‌టిఐ ద్వారా పలువురు సమాచారం అడిగారన్నారు. ఇంటి పట్టాలు గాని, పొజిషన్ సర్టిఫికేట్లు గాని మా కార్యాలయం నుండి ఎవరికీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. సర్వే నెం. 634/ఏ వివాదం పై కనిగిరి ఆర్డీఓ అజయ్‌కుమార్‌కు నివేదిక ఇవ్వడం జరిగిందన్నారు.

మున్సిపల్ కమిషనర్ ఎమన్నారంటే....సర్వే నెం.634/ఏ లో 2024 లో అక్రమ కట్టడాలు తొలగించిన మీరు ఇప్పుడు అదే భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే ఎందుకు పట్టించుకోలేదని వెలుగు ప్రతినిధి ప్రశ్నించగా తనకేమి తెలియదని కమిషనర్ పి శ్రీధర్ అన్నారు. ఇన్‌ఛార్జి టౌన్ ప్లానింగ్ అధికారిని పిలిచి అక్రమ నిర్మాణాల విషయం పరిశీలించి తనకు నివేదిక ఇవ్వాలని చెప్పడం గమనార్హం.

ప్రభుత్వంతో ప్రతి పల్లెలో పండగ వచ్చింది

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 1)



కూటమి ప్రభుత్వంతో ప్రతి పల్లెలో పండుగ వచ్చిందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బోడిచర్ల గ్రామంలో పల్లె పండుగ, ప్రజల సేవలో 2.0 గ్రామ సభలో జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీతతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి బోడిచర్ల గ్రామంలోని ప్రఖ్యాత ఆంజనేయస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎం విజయసునీత తో కలిసి "పల్లె పండుగ" కార్యక్రమంలో భాగంగా మొదటిగా గ్రామంలోని రూ.40 లక్షల రూపాయలతో సిసి రోడ్లకు, నూతనంగా (తరువాయి 5లో...)

అవిభక్త ప్రకాశం జిల్లాలో మహాత్మా గాంధీ అడుగు జాడలు
గాంధీ దర్శనం పేరిట మహాత్మా గాంధీ పై 50 పుస్తకాల రచనకు శ్రీకారం చుట్టిన మహాత్మా గాంధీ స్ఫూర్తి కేంద్రం అధ్యక్షులు ఎంవిఎస్ శాస్త్రి
స్వచ్ఛభారత్.. ప్రకాశం జిల్లాలో మహాత్మా గాంధీ.. సత్య అహింసల మహర్షి మహాత్మా గాంధీ అనే మూడు పుస్తకాలను ప్రచురించిన ఎంవిఎస్ శాస్త్రి
ప్రపంచ శాంతి సాధనకు గాంధీ మహాత్ముని బోధనలను పాటించడమే మార్గమని స్పష్టీకరణ

యుగపురుషుడు... స్వాతంత్ర్య సేనాని మహాత్మా గాంధీ



(ఎంవిఎస్ శాస్త్రి, అధ్యక్షులు, మహాత్మాగాంధీ స్ఫూర్తి కేంద్రం, ఒంగోలు)

భారతదేశం అనగానే అందరికీ వెంటనే స్ఫురించే పేరు మహాత్మాగాంధీ. ప్రపంచ చరిత్రలో మహాత్మా గాంధీకి సాటి వచ్చే నాయకుడు మరొకరు లేరు. సత్యాగ్రహ మంత్రంతో అహింసాయుత ప్రతిఘటనతో ప్రజలను తన వెంట నడిపించి దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించి పెట్టిన ఘనత మహాత్మా గాంధీకి దక్కుతుంది. మహాత్మా గాంధీ దేశంలో ▶4లో

హార్టికల్చర్ హబ్‌లో పర్యాటకు అవకాశం
నేడు మదనపల్లిలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం
మార్కూరులో రైతులతో కలిసి లైవ్‌స్ట్రీమింగ్ వీక్షించనున్న ఎమ్మెల్యే ఏలూరి
రైతులతో ముఖాముఖి...ఉద్యాన సాగుపై చర్చ


4

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం



4

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
జంగాలపల్లి, అయ్యపురాజుపాలెంలో
ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ
రూ.64 లక్షలతో అప్రోచ్ రోడ్డు నుండి అయ్యపురాజుపాలెం వరకు
సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన
మరో 13 రోడ్ల నిర్మాణానికి రూ.24.20 లక్షలు కేటాయింపు



అభ్యర్థి ఎవరైనా సరే మొట్టమొదటి మున్సిపల్ ఛైర్మన్ పీఠం వైసీపీదే

మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు (షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 1)

అభ్యర్థి ఎవరైనా వొంట్ట వొంద టి మున్సిపల్ ఛైర్మెన్ పీఠం వైస్సార్సీపీదే నని మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి అన్నా వెంకట రాంబాబు అన్నారు. గురువారం పొదిలిలోని వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో పొదిలి నగర పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్క కార్యకర్తకు గుండెల నిండా ధైర్యాన్ని నూరి పోసారు. ప్రతి వార్డులో వైఎస్ఆర్సిపి ఏ రిజర్వేషన్ అయినా కానీ అభ్యర్థి వైఎస్ఆర్సిపి అయితే కచ్చితంగా విజయం సాధించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అలాగే ఛైర్మన్ అభ్యర్థి ఎవరైనా సరే అది మొట్టమొదటి పొదిలి మున్సిపల్ ఛైర్మన్‌గా వైయస్సార్సీపి జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు ఆత్మ స్థైర్యాన్ని. ▶5లో




వాదంపల్లిలో టీడీపీకి షాక్

ప్రచారం ఎంత చేసినా
ప్రజల నమ్మకం ఎటువైపు ఉందో వాదంపల్లి మరోసారి చాటిచెప్పింది

5

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం





(షణ్ముఖ వెలుగు, కొండపి, అక్టోబర్ 1)

కొండేపి నియోజకవర్గం మర్రిపూడి మండల పరిధిలోని జంగాలపల్లి, అయ్యపురాజుపాలెం గ్రామాలలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు స్వయంగా పంపిణీ చేశారు. అనంతరం అయ్యపురాజుపాలెం గ్రామంలో రూ.64 లక్షల అంచనా వ్యయంతో అప్రోచ్ రోడ్డు నుండి గ్రామం వరకు నిర్మించనున్న నూతన సిమెంట్ (సీసీ) రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ వివరాలను మంత్రి సుదీర్ఘంగా వివరించారు. సెప్టెంబర్ నెల నివేదిక ప్రకారం, జంగాలపల్లి గ్రామంలోని 35 మంది వృద్ధులకు రూ.1,40,000, 10 మంది వితంతువులకు రూ.40,000, 6 మంది వికలాంగులకు రూ.48,000, ఇద్దరు డీఎంహెచ్ఓ లబ్ధిదారులకు రూ. 20,000, ఒక ఏకాకి మహిళకు రూ.4,000 చొప్పున మొత్తం 56 మంది లబ్ధిదారులకు రూ.2,52,000 పింఛన్ సొమ్మును అందజేశారు. అదేవిధంగా అయ్యపురాజుపాలెం గ్రామంలో 98 మంది వృద్ధులకు రూ.3,92,000, 31 మంది వితంతువులకు రూ.1,24,000, 18 మంది వికలాంగులకు రూ.1,08,000, ఐదుగురు ఏకాకి మహిళలకు రూ.20,000, నలుగురు డీఎంహెచ్ఓ లబ్ధిదారులకు రూ.40,000 చొప్పున మొత్తం 156 మందికి రూ.6,84,000 విడుదల చేశారు. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి గణాంకాలను పరిశీలిస్తే, మర్రిపూడి మండలం వ్యాప్తంగా ఉన్న వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, డప్పు కళాకారులు, చేనేత, కల్లు గీత కార్మికులు తదితర వర్గాలకు చెందిన మొత్తం 5,323 మంది లబ్ధిదారులకు రూ.2,35,60,500 (రూ.2,356 కోట్లు) పంపిణీ చేయడం జరిగింది. కొండేపి నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 41,238 మంది పింఛనుదారులకు రూ.18,032 కోట్ల నిధులను ప్రభుత్వం అందజేసింది. ఇక సమగ్ర ప్రకాశం జిల్లా వివరాలను చూస్తే, జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,16,273 మంది అర్హులైన పింఛనుదారుల కోసం రూ.93.923 కోట్ల భారీ మొత్తాన్ని విడుదల చేసి, ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారుల ముంగిటకే పింఛన్ సొమ్మును చేరుస్తున్నట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తున్నామని చెప్పారు. అయ్యపురాజుపాలెం గ్రామంలో తమ ప్రభుత్వ హయాంలో ఇప్పటికే దాదాపు అన్ని రహదారులను నిర్మించామని, మిగిలి ఉన్న 13 రోడ్ల నిర్మాణ పనులను రూ.24.20 లక్షల వ్యయంతో త్వరలోనే పూర్తి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో వీరరెడ్డిపాలెం గ్రామం నుండి అత్యవసర సమయంలో అంబులెన్స్ వెళ్లడానికి కూడా వీలులేని విధంగా రోడ్లు ధ్వంసమయ్యాయని, ఆ సమస్యను పరిష్కరిస్తూ రూ.1.50 కోట్ల నిధులతో నూతన రహదారిని నిర్మించినట్లు గుర్తుచేశారు. మన కొండేపి హార్టికల్చర్ హబ్ పరిధిలోకి ఈ గ్రామం కూడా వస్తుందని, తద్వారా స్థానిక రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. అలాగే వెలుగొండ ప్రాజెక్టు ద్వారా పాలేరు ప్రాజెక్టుకు నీటిని తరలించి ప్రాంతీయంగా తాగు, సాగునీటి కష్టాలను శాశ్వతంగా తీరుస్తామని, త్వరలోనే సంగమేశ్వరం ప్రాజెక్టు పనులను కూడా ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. సభలో గ్రామంలోని రోడ్ల పక్కన జరిగిన ఆక్రమణల గురించి ప్రజలు మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే స్పందించారు.

ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న ఆక్రమణలపై రెవెన్యూ, పోలీసు అధికారులు తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో అమాయకులపై తప్పుడు కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంలో ఎవరిపైనా కావాలని తప్పుడు కేసులు పెట్టే ప్రసక్తే లేదని, అయితే ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తూ తప్పులు చేసే వారిని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. చివరగా, రాష్ట్రంలో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాల ప్రాముఖ్యతను మంత్రి వివరించారు. రైతులకు పెట్టుబడి సాయంగా ఇచ్చే 'అన్నదాత సుఖీభవ', పిల్లల చదువుల నిమిత్తం తల్లులకు అందించే 'తల్లికి వందనం', ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి ఉద్దేశించిన 'దీపం' పథకంతో పాటు పాడి రైతులకు లబ్ధి చేకూర్చే పాలు పథకం గురించి వివరంగా తెలపడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే తమ లక్ష్యమని డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి అర్జున్ నాయక్, తహసిల్దార్ జనార్దన్, ఎంపిడిఓ ఎస్కె నాగూర్ వలి, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హార్టికల్చర్ హబ్‌లో పర్చూరుకు అవకాశం

(షణ్ముఖ వెలుగు, మార్టూరు, అక్టోబర్ 2)

రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పర్చూరు నియోజకవర్గానికి అవకాశం లభించింది. ఈ నెల 2వ తేదీన మదనపల్లిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని పర్చూరు నియోజకవర్గ రైతులతో కలిసి మార్టూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు లైవ్‌స్ట్రీమింగ్ ద్వారా వీక్షించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించి, ఉద్యాన పంటల సాగు, రైతుల అవసరాలు, మార్కెటింగ్, ప్రాసెసింగ్, సాగునీరు తదితర అంశాలపై చర్చించనున్నారు. హార్టికల్చర్ హబ్ ద్వారా పర్చూరు ప్రాంత రైతులకు కలిగే అవకాశాలు, ప్రభుత్వం అందించనున్న ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు.


పర్చూరు రైతులకు కొత్త అవకాశాలు


రాయలసీమను దేశంలోనే కీలకమైన ఉద్యాన ఉత్పత్తుల కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగా పర్చూరు నియోజకవర్గానికి అవకాశం కల్పించడం ద్వారా ఇక్కడి ఉద్యాన రైతులకు కొత్త అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. మామిడి, మిరప, కూరగాయలు, ఆయిల్‌పామ్ తదితర ఉద్యాన పంటల సాగుతో పాటు పంట కోత అనంతర నిర్వహణ, ప్రాసెసింగ్, నిల్వ, రవాణా, మార్కెటింగ్, ఎగుమతులకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.


రైతులందరూ హాజరు కావాలి

మదనపల్లిలో జరిగే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మార్టూరులో రైతులతో కలిసి వీక్షించడం ద్వారా గ్లోబల్ హార్టికల్చర్ హబ్ లక్ష్యాలు, పర్చూరు నియోజకవర్గానికి దక్కిన అవకాశాలను రైతులకు వివరించనున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ రంగానికి చెందిన వారు ఈ నెల 2న అనగా శుక్రవారం మార్టూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు.

యుగపురుషుడు...స్వాతంత్ర్య సేనాని మహాత్మా గాంధీ







ఏ ప్రాంతానికి వెళ్లినా ఆయనను చూసేందుకు ఆయన బోధనలు వినేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యేవారు. గాంధీ మహాత్ముని బోధనలు ప్రజలను విశేషంగా ఆకట్టుకునేవి. గాంధీని ప్రజలు దైవావతారంగా భావించేవారు. మహాత్మా గాంధీ ప్రకృతి విపత్తులు సంభవించి ప్రజలు కడగండ్ల పాలవుతున్నారన్న విషయం తెలిసిన వెంటనే ప్రజలను కలుసుకుని బాధితులను ఊరడించేవారు. వారికి అవసరమైన సహాయం అందేలా ప్రేరేపించేవారు. గాంధీ మహాత్ముని పవిత్ర పాదస్పర్శతో పునీతమైన ప్రదేశాలలో అవిభక్త ప్రకాశం జిల్లా కూడా ఒకటి. మహాత్మా గాంధీ పలుమార్లు అవిభక్త ప్రకాశం జిల్లాలో పర్యటించారు.

ప్రకాశం జిల్లాలో మహాత్మా గాంధీ తొలి పర్యటన వివరాలు :

ఆంగ్ల ప్రభుత్వం చీరాల...పేరాల గ్రామాలను విలీనం చేసి మునిసిపాలిటీ గా చేయాలనే ప్రయత్నాలను ప్రజలు వ్యతిరేకించారు. ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నాయకత్వంలో ప్రజలు ఉద్యమించారు. ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా సహాయ నిరాకరణ చేశారు. పన్నులు చెల్లించని కొందరిని ప్రభుత్వం జైలులో పెట్టింది. విజయవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో మహాత్మా గాంధీ పాల్గొన్నారు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య విజయవాడకు వెళ్లి గాంధీ గారిని కలిసి చీరాల..పేరాల ప్రజల ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. అంగీకరించిన మహాత్మా గాంధీ 1921 ఏప్రిల్ 6 వ తేదీన చీరాలకు వచ్చారు. ప్రకాశం జిల్లాలో మహాత్మా గాంధీ జరిపిన తొలి పర్యటన ఇది. గాంధీజీ చీరాల..పేరాల ప్రజల ఉద్యమానికి మద్దతు ప్రకటించడమే కాక రాం నగర్ కు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ నిర్బంధానికి గురైన 13 మందిని సన్మానించారు. వారిలో ఒకరైన రావూరి అలివేలు మంగ తాయారమ్మ దేశంలోనే మొట్టమొదటి మహిళా రాజకీయ ఖైదీగా పేరు పొందారు. తిలక్ స్వరాజ్య నిధికి గాను దుగ్గిరాల గోపాలకృష్ణయ్య మహాత్మా గాంధీకి 5 వేల రూపాయలు సమర్పించారు. పెండెం కేశవులు అనే చేనేత కార్మికుని చేనేత నైపుణ్యాన్ని గాంధీజీ ప్రశంసించారు. టంగుటూరి ప్రకాశం పంతులు చీరాల..పేరాల ప్రజల ఉద్యమానికి వెయ్యి రూపాయలు విరాళంగా అందజేశారు.

మహాత్మా గాంధీ వేటపాలెం పర్యటన : మహాత్మా గాంధీ 1929 ఏప్రిల్ 17, 18 తేదీలలో మరోసారి ప్రకాశం జిల్లాలో పర్యటించారు. ఏప్రిల్ 17 న కారంచేడుకు చేరుకున్న గాంధీజీ ఏప్రిల్ 18 న వేట పాలెంలో సారస్వత నికేతన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జన సందోహంతో గాంధీ గారి చేతి కర్ర విరిగి పోగా దానిని తరువాత వేటపాలెం లైబ్రరీ సారస్వత నికేతన్‌లో భద్రపరిచారు. నేటికీ సారస్వత నికేతన్ సందర్శించే వారికి గాంధీజీ చేతి కర్ర గొప్ప మధుర జ్ఞాపకంగా మిగిలే ఉంది. చీరాల, తిమ్మసముద్రం ప్రజలు ఖద్దరు నిధికి గాను గాంధీ గారికి విరాళాలను సమర్పించారు.

కందుకూరు పర్యటన : ఖద్దరు నిధికి విరాళాలు సేకరించడం కోసం గాంధీజీ 1929 మే 11 న గాంధీజీ తన సతీమణి కస్తూరిబా గాంధీ సమేతంగా జిల్లాలోని ఉలవపాడు, కందుకూరు, పామూరు, బొట్ల గూడూరు మున్నగు ప్రాంతాలలో పర్యటించారు. కందుకూరు అంకాళమ్మ గుడి వద్ద ఏర్పాటైన సభలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఖాదీ కార్యకర్తల సమావేశంలో కూడా గాంధీజీ ప్రసంగించారు.దుర్గాబాయి దేశ ముఖ్, కొండా వెంకటప్పయ్య, ఆచంట లక్ష్మీనరసింహం, ప్యారే లాల్ తదితరులు గాంధీ వెంట పాల్గొన్నారు. విదేశీ వస్త్రాలు ధరించిన క్షురకుని చేత క్షౌరము చేయించుకునేందుకు గాంధీ నిరాకరించారు.

చీరాలలో ఆగడం : 1933 డిసెంబర్ 23 న గాంధీజీ మెయిల్ ఎక్స్‌ప్రెస్‌లో మద్రాస్ నుంచి గుంటూరు వెళుతూ చీరాలలో ఆగారు. అప్పటి ఆంధ్ర పత్రిక విలేఖరి పెనుగొండ సుబ్రహ్మణ్యం హరిజన నిధి కోసం తన బంగారం ఉంగరాన్ని గాంధీజికి అందజేశారు. 1936 జూన్ 12 న గాంధీజీ మద్రాస్ నుంచి వార్ధాకు రైలులో ప్రయాణమయ్యారు. రైలు చీరాలలో ఆగగానే ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి గాంధీకి ఘన స్వాగతం పలికారు. మహాత్మా గాంధీకి జై నినాదాలతో హోరెత్తించారు. హరిజన నిధికి విరాళాలు అందచేశారు.

తుఫాను బాధితులను ఓదార్చడం : 1936 అక్టోబర్ 28, 29 తేదీలలో చీరాల ప్రాంతంలో తీవ్రమైన తుఫాను సంభవించి ప్రజలు పెద్ద ఎత్తున నష్ట పోయారు. పలువురు మృతి చెందారు. బాధితులకు ఓదార్పు నివ్వడం కోసం గాంధీజీ 1937 జనవరి 24 న చీరాల ప్రాంతంలో పర్యటించారు. పేదలను ఆదుకునేందుకు ధనికులు, వదాన్యులు ముందుకు రావాలని గాంధీ పిలుపు ఇచ్చారు. గాంధీజీ పిలుపుకు పెద్ద ఎత్తున స్పందన లభించింది. పలువురు తమ విరాళాలతో పాటు వస్తువులు దుస్తులు అందచేయగా గాంధీజీ అక్కడి కక్కడే వాటిని బాధితులకు పంచి పెట్టారు. తిమ్మ సముద్రంలో గొప్ప వదాన్యులైన గోరంట్ల వెంకన్న గాంధీ గారి పిలుపుకు స్పందించి తనకు గల ఆరు ఎకరాలను దళితుల నివాస గృహాల నిర్మాణం కోసం దానం చేశారు. పేదలు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉండేలా చర్యలు చేపట్టారు. వెంకన్న గారి దాతృత్వాన్ని గాంధీ అభినందించారు. తుఫాను బాధితులను ఆదుకోవడం కోసం వెంకన్న గాంధీజీకి పెద్ద మొత్తాన్ని విరాళంగా అందజేశారు. గాంధీజీ ఇంకొల్లు, గొల్ల పాలెం, పోతిన వారి పాలెం, నూతలపాడు తదితర ప్రాంతాల్లో కూడా పర్యటించి బాధితులను ఊరడించారు. పర్చూరులో మంచాళ సీతా రామయ్య ఇంటిలో గాంధీజీ బస చేశారు. తన పర్యటన వార్తను కవర్ చేసేందుకు వచ్చిన పత్రికా విలేఖరులను కూడా గాంధీ విడిచి పెట్టలేదు. మీరు కూడా మీకు తోచిన సహాయం బాధితులకు అందించాలని గాంధీ వారిని కోరారు.

ఒంగోలులో ఆగడం : మహాత్మా గాంధీ ప్రయాణిస్తున్న రైలు 1946 జనవరి 21 న ఒంగోలు రైల్వే స్టేషన్ లో ఆగడంతో ఆయనను చూసేందుకు 15 వేల మందికి పైగా ప్రజలు రైల్వే స్టేషన్ కు చేరుకున్నారు. గాంధీజీకి విరాళాలను సమర్పించారు. గాంధీజీని ఆనాడు ప్రత్యక్షంగా చూసిన వారిలో జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు నందనం ఒకరు. టంగుటూరు ప్రజలైతే గాంధీని చూడాలనే తపనతో రైలు పట్టాలపై ఎర్ర జండాలు పాతి మరీ రైలును ఆపి గాంధీని కనులారా తిలకించి ఆనందించారు. మహాత్మా గాంధీ పట్ల అప్పటి ప్రజల్లో ఉన్న విశేష గౌరవానికి పై సంఘటన తార్కాణం. గాంధీ మహాత్ముని పవిత్ర పాద స్పర్శతో అవిభక్త ప్రకాశం జిల్లా పునీతమైంది. గాంధీ గుర్తుగా జిల్లాలో అనేక చోట్ల ఆయన పేరిట విగ్రహాలను..సంస్థలను నెలకొల్పారు.

గాంధీ స్ఫూర్తితో జిల్లాలో జరిగిన ఉద్యమాలు : మహాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రకాశం జిల్లాలో పలు కార్యక్రమాలు జరిగాయి. వస్త్ర వ్యాపారంలో చిన్న బొంబాయిగా పేరొందిన చీరాలలో విదేశీ వస్త్ర విక్రయాలకు వ్యతిరేకంగా గొల్లపూడి సీతారామ శాస్త్రి నాయకత్వంలో పికెటింగ్ జరిగింది. గాంధీ పిలుపుతో అంటరానితనం నిర్మూలనలో భాగంగా 1933 మే 12 నుండి ప్రకాశం జిల్లాలో అస్పృశ్యతా నిర్మూలన ప్రచార కార్యక్రమాలు ఒంగోలు, టంగుటూరు, వల్లూరు, సూరారెడ్డి పాలెం మున్నగు చోట్ల జరిగాయి. అగ్ర వర్ణాల వారు హరిజనులతో సహ పంక్తి భోజనాలు చేశారు. వారికి దేవాలయ ప్రవేశం కల్పించారు. ఒంగోలులో అస్పృశ్యతా నిర్మూలన సభ కార్యక్రమాలను ధారా గోపాల శాస్త్రి, చెరువు వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, నేతి సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. త్రోవగుంట జానకీ రామయ్య సభకు అధ్యక్షత వహించారు. ఆచార్య రంగా, ముక్తేశ్వర ప్రసాద్ రావు తదితరులు ప్రసంగించారు. టంగుటూరులో పోతుల బుచ్చి నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో కూడా ఆచార్య రంగా పాల్గొన్నారు. సామాన్య ప్రజలు ఉపయోగించే ఉప్పు పై ఆంగ్ల ప్రభుత్వం విపరీతంగా పన్ను భారం మోపడాన్ని నిరసిస్తూ మహాత్మా గాంధీ 1930 మార్చి 12 న ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించారు. ఉప్పు సత్యాగ్రహంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. 1930 ఏప్రిల్ 6న గాంధీజీ దండిలో ప్రభుత్వ ఉప్పు చట్టాలను ఉల్లంఘించి ఉప్పు సేకరించడం, బొంబాయిలోని ఉప్పు గోదాములపై దాడి చేస్తామని ప్రకటించడంతో ఆంగ్ల ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసింది. దీనితో దేశ వ్యాప్తంగా పోరాటం ఉధృతమైంది. ప్రకాశం జిల్లాలో ఉప్పు పోరాటం విజయవంతంగా సాగింది. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారికి దేవరం పాడులో గల భవనం ఉప్పు సత్యాగ్రహుల శిబిరంగా ఉపయోగ పడింది. ఆంగ్ల ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం మూలంగా గాంధీజీ ఉప్పు సత్యాగ్రహం విరమించారు. ప్రకాశం జిల్లాలో ఉప్పు సత్యాగ్రహం విజయవంతం అయిన దానికి గుర్తుగా దేవరం పాడులో విజయ స్తంభాన్ని ప్రతిష్టించారు. 1935 నవంబర్ 21న అప్పటి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాబూ రాజేంద్ర ప్రసాద్ దేవరం పాడును సందర్శించి విజయ స్తంభాన్ని ఆవిష్కరించారు.

మహాత్మా గాంధీ బోధనల ప్రచారానికి ఎంవిఎస్ శాస్త్రి కృషి :

మహాత్మా గాంధీ ఆదర్శాలను..ఆశయాలను ప్రజలకు ముఖ్యంగా నేటి యువతకు తెలియ చెప్పే లక్ష్యంతో ఎంవిఎస్ శాస్త్రి ఒంగోలులో మహాత్మా గాంధీ స్ఫూర్తి కేంద్రం అనే సంస్థను స్థాపించి గాంధీ దర్శనం పేరిట 50 పుస్తకాల ప్రచురణకు శ్రీకారం చుట్టారు. స్వచ్ఛ భారత్ , సత్య ..అహింసల మహర్షి మహాత్మా గాంధీ, ప్రకాశం జిల్లాలో మహాత్మా గాంధీ అనే మూడు పుస్తకాలను శాస్త్రి వెలువరించారు. గాంధీ దర్శనం పేరిట మార్కాపురం రేడియో కేంద్రం ఎంవిఎస్ శాస్త్రితో జరిపిన ఇంటర్వ్యూను 2013 జనవరి 30 నుండి ఏప్రిల్ 17 దాకా 13 వారాల పాటు ధారావాహికగా ప్రసారం చేసింది. 2020 జనవరి 30న మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధేయ భారతం పేరిట విజయవాడ రేడియో కేంద్రం ఎంవిఎస్ శాస్త్రి ప్రసంగ వ్యాసాన్ని ప్రసారం చేసింది. కొంత కాలం క్రితం మార్కాపురం సాధన డిగ్రీ కళాశాలలో ఏర్పాటు అయిన నెలనెలా వెన్నెల ఉపన్యాస కార్యక్రమంలో ఎంవిఎస్ శాస్త్రి పాల్గొని మహాత్మా గాంధీ గొప్పతనాన్ని తెనుగు లెంక తుమ్మల సీతారామమూర్తి వంటి మహనీయులకు గాంధీ మార్గం ఆదర్శంగా మారిన వైనాన్ని గురించి వివరించారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న ఒక యువకుడు లేచి మహాత్మా గాంధీ గురించి తనకు కొంతమంది చెడుగా చెప్పారని ఆ మాటలను నిజమని నమ్మి గాంధీని ద్వేషిస్తూ వచ్చానని గాంధీ గొప్పతనం గురించి వివరించి చెప్పాక ఈ క్షణం నుంచి గాంధీ పట్ల తనకున్న ద్వేష భావాన్ని విడనాడుతున్నానని సభాముఖంగా ప్రకటించాడు. దేశం కోసం దేశ స్వాతంత్ర్య సాధన కోసం గాంధీ పడిన కష్టాలు చేసిన త్యాగాలు తన ప్రసంగం ద్వారా విని ఒక యువకుడు గాంధీ వ్యతిరేక భావజాలాన్ని విడనాడి మార్పు చెందడం తనకెంతో ఆత్మ సంతృప్తిని కలిగించిందని శాస్త్రి తెలిపారు. మహాత్మా గాంధీ బోధనల గొప్పతనాన్ని నేటి యువతకు తప్పక తెలియజేయవలసిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ప్రపంచ శాంతి సాధనకు అన్ని దేశాలు గాంధీ మహాత్ముని బోధనలను పాటించడం ఒక్కటే పరిష్కార మార్గమని ఎంవిఎస్ శాస్త్రి స్పష్టం చేశారు.

స్వచ్ఛంద రక్తదానంతో ప్రాణదాతలు కావచ్చు
డాక్టర్ పి యుగంధర్
యువత పెద్దఎత్తున రక్తదానానికి ముందుకు రావాలి
రిమ్స్ రక్తనిధి కేంద్రంలో ఘనంగా జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, అక్టోబర్ 1)

స్వచ్ఛంద రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడటంతో పాటు బాధిత కుటుంబాల్లో భరోసా నింపవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి యుగంధర్ పేర్కొన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా గురువారం కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) రక్తనిధి కేంద్రంలో జిల్లా వైద్య



ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఏపీఎస్ఏసీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ యుగంధర్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎస్ రవి బాబు, క్లస్టర్ అధికారి వేంపల్లి భాస్కర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, గాంధీ జయంతి సందర్భంగా కూడా యువత పెద్దఎత్తున రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. 18 నుంచి 65 ఏళ్ల మధ్య వయస్సు ఉండి, సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న ప్రతి ఒక్కరూ అర్హులని తెలిపారు. డాక్టర్ ఎస్ రవిబాబు, వేంపల్లి భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన రక్తనిధి కేంద్రాల్లోనే సురక్షితంగా రక్తదానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రక్తనిధి వైద్యాధికారులు డాక్టర్ సింధుజ, డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ సంధ్య, డాక్టర్ వినయ్, డీఐఎస్‌హెచ్ఏ సిబ్బంది విశ్వనాథ్‌రెడ్డి, రాజ్‌ఖాన్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

30 వార్డులో "ఇంటింటికి టిడిపి" కార్యక్రమంలో పల్నాడు జిల్లా పార్లమెంటరీ సెక్రటరీ షేక్ జానీ భాష




(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 1)

మాచర్ల నియోజకవర్గం అభివృద్ధి ప్రదాత మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆదేశాల మేరకు గురువారం 30 వార్డులో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న, "ఇంటింటికి టిడిపి" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 62 బూత్ ఇంచార్జి, పల్నాడు జిల్లా పార్లమెంటరీ సెక్రటరీ షేక్ జానీ భాష ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి , సంక్షేమ పథకాలు గురించి వార్డులోని ప్రజలకు వివరించారు. అనంతరం వార్డులను ప్రజలు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం లో తల్లికి వందనం కుటుంబంలో ఒక్కరికే అందాయని, కానీ కూటమి ప్రభుత్వంలో తల్లికి వందనం ప్రతి కుటుంబం లో ఎంతమంది ఉంటే అంతమందికి పిల్లలకు అందుతున్నాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు చేరాయా లేదా అని అడగలేదని, కానీ రెండున్నర ఏళ్ల కూటమి ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. రూ3వేల నుంచి4 వేల వరకు వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకురూ4 వేలు నుంచి 6 వేలు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు.నిత్యం వార్డులోనిప్రజలకు అందుబాటులో ఉంటూఏమైనా సమస్యలు ఉంటే జానీ భాష దృష్టికి తీసుకెళ్లగా ఆ సమస్యలను సత్వరమే మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను సంబంధిత అధికారుల చేత పరిష్కరింప చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో 63వ బూతు ఇంచార్జి కే శివ పార్వతి, మాజీ ముస్లిం మైనార్టీ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ రసూల్, జనసేన నాయకులు షేక్ ఫారుక్, షేక్ జాన్ అహ్మద్, వార్డు అధ్యక్షుడు మణికంఠ, టిడిపి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంతో ప్రతి పల్లెలో పండగ వచ్చింది





మంజూరైన గోకులం షెడ్లకు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేశామని వైసిపి నాయకులు చెబుతున్నారని, కానీ తమ ప్రభుత్వం వారి మీద సంక్షేమాలు మిన్నగా అమలు చేస్తున్నామని, మూడు వేల రూపాయల పెన్షన్ ఇస్తామని చెప్పి 4 సంవత్సరాలు కాలం వెళ్లబుచ్చి పెన్షన్ దారులను మోసం చేశారన్నారు. కానీ తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.4 వేలు పెన్షన్ దారులకు ఇచ్చామని, అమ్మఒడి అంటూ ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అందరికీ ఇస్తామని చివరికి చేతులెత్తి ఇంట్లో ఒకరికి అమ్మ ఒడి పథకాన్ని అమలు చేశారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు ఉంటే వారందరికీ తల్లికి వందనం పథకం కింద రూ.13,000లు ఇచ్చామని, రైతు భరోసా పేరుతో వైసీపీ ప్రభుత్వం సంవత్సరానికి 13 వేలుఇస్తే తాము అన్నదాత సుఖీభవ పేరుతో సంవత్సరానికి రూ.20 వేలు ప్రతి రైతు కుటుంబానికి ఇస్తున్నామని, మహిళకు వంటింట్లో ఇబ్బంది రాకుండా ప్రతి కుటుంబానికి సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని, మహిళలు ఏ పుణ్యక్షేత్రాలు కు వెళ్లాలన్న లేదా ఏ చోటికి వెళ్లాలని ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని, అన్నా క్యాంటీన్ ద్వారా ఐదు రూపాయలకే అల్పాహారం, భోజనం సదుపాయం కల్పిస్తున్నామని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కంటే తమ ప్రభుత్వం సంక్షేమాన్ని మిక్కిలిగా అమలు చేస్తుందని అన్నారు. ఇక అభివృద్ధి విషయంలో మన ప్రాంతంలో ఇచ్చిన మాటకు కట్టుబడి మార్కాపురం ప్రత్యేక జిల్లా ప్రకటించామని, ఈ రెండు సంవత్సరాలు కాలంలో కలలో కూడా ఊహించిన విధంగా ఎంతో వేగంగా వెలుగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి ఈ గ్రామానికి కూతవేటు దూరంలో ఉన్న నల్లమల సాగర్‌ను నీటితో నింపుతున్నామని, ఇక హార్టికల్చర్ హబ్‌తో ఈ ప్రాంత రైతులు ప్రజలు కోటీశ్వరులు కాబోతున్నారన్నారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి మన ప్రాంత ప్రజలు ఎంతో రుణపడి ఉన్నామన్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజలు పనిచేసేవారిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మండల ప్రజలు, గ్రామ ప్రజలు, పెద్దలు పాల్గొన్నారు.

అభ్యర్థి ఎవరైనా సరే మొట్టమొదటి మున్సిపల్ ఛైర్మన్ పీఠం వైసీపీదే





హుషారుని నింపారు. కూటమి ప్రభుత్వం చెప్పిన హామీలు నెరవేర్చలేదన్నారు. బిసిలకు మరో మారు అన్యాయం చేయడమే చంద్రబాబునాయుడు నిర్ణయం అన్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం రిజర్వేన్‌లు 50 శాతానికి మించకూడదని తెలిసినప్పటికీ కేవలం బిసిల తనకు మాత్రమే ప్రేమ ఉన్నది చూపించుకునేందుకు మాత్రం రిజర్వేషన్లు ప్రకటించారన్నారు. చంద్రబాబునాయుడు బిసిలకు ప్రకటించిన రిజర్వేషన్లు అమలు జరగాలంటే పార్లమెంటులో చట్టం చేయాల్సిన ఆవశ్యకత ఉందని సీనియర్ నాయకుడిగా ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడుకు తెలియంది కాదన్నారు. కేవలం బిసిల ఓట్లను కొల్లగొట్టేందుకు ఈ నిర్ణయం ప్రకటించి చివరల్లో కోర్టు పైన నెపం వేస్తారన్నారు. అభిమానులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శులు షేక్ షంషీర్ అలీ బేగ్, కెవి రమణారెడ్డి, పొదిలి నగర పంచాయతీ వైస్సార్సీపీ అధ్యక్షులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పిటిసి సాయి రాజేశ్వరరావు, మాజీ ఎంపిపి కోవెలకుంట్ల నరసింహారావు, కల్లం వెంకట సుబ్బారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, గుర్రపుసాల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలలో వైఎస్ఆర్సిపి జెండా ఎగరవేయడానికి ప్రతి ఒక్క కార్యకర్త ఉత్సాహంగా ముందుకు వెళుతున్నట్లు ఆయన తెలియజేశారు.

వాదంపల్లిలో టీడీపీకి షాక్

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, అక్టోబర్ 1)

ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంటే క్షేత్రస్థాయిలో మాత్రం సీన్ రివర్స్! యర్రగొండపాలెం మండలం వాదంపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీని వీడి 10 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. యర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ వారికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పత్తి సుబ్బారావు చౌదరి, దుగ్గినేని మల్లిఖార్జున చౌదరి, చేకూరి చెన్నకేశవులు చౌదరి, జెట్టేబోయిన చెన్నకేశవులు, వీరితో పాటు 10 కుటుంబాలు పార్టీలో చేరాయి. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి, గ్రామ సర్పంచ్ పెబ్బిశెట్టి శ్రీనివాసులు, వాదంపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన రాజయ్య, వాదంపల్లి గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు దసరా ఉత్సవాల ప్రత్యేక పుస్తకాల ఆవిష్కరణ
ఆర్యవైశ్య సభ అధ్యక్షులు బుశెట్టి రామమోహన్ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, ప్రొద్దుటూరు, అక్టోబర్ 1)

ప్రొద్దుటూరులో ఘనంగా నిర్వహించనున్న దసరా ఉత్సవాలను పురస్కరించుకుని రూపొందించిన ప్రత్యేక పుస్తకాలను ఆర్యవైశ్య సభ అధ్యక్షులు బుశెట్టి రామమోహన్, కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దసరా ఉత్సవాల విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాధాన్యత, సంప్రదాయాలు, ఉత్సవ కార్యక్రమాల వివరాలను ప్రజలకు చేరువ చేయడంలో ప్రత్యేక పుస్తకాలు ఉపయోగపడతాయని వారు తెలిపారు. దసరా పర్వదినాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను, సాంస్కృతిక సంప్రదాయాలను పెంపొందించేలా ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఉత్సవాలను మరింత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అభినందించారు. ప్రొద్దుటూరు దసరా ఉత్సవాలకు జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని, ఉత్సవాల్లో భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి పుస్తకాలు, కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ సెక్రటరీ మురికి నాగేశ్వరావు జాయింట్ సెక్రటరీ మల్లెంకొండు ప్రతాప్ ఆర్యవైశ్య సభ సభ్యులు ప్రముఖులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు. దసరా ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నిర్వాహకులు కోరారు.







కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ సెంటర్, మార్చురీ భవనాల నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర








(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, అక్టోబర్ 1)

కనిగిరి ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న డయాలసిస్ సెంటర్, మార్చురీ భవనాలను ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి గురువారం సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత వైద్యాధికారులు, ఆసుపత్రి సిబ్బంది, కాంట్రాక్టర్‌తో కలిసి భవనాల నిర్మాణ ప్రగతిని సమీక్షించారు. డయాలసిస్ సెంటర్ ద్వారా కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రాంత ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన సదుపాయాలను కల్పించడంపై చర్చించారు. అలాగే మార్చురీ భవనంలో అవసరమైన మౌలిక వసతులు అంశాలపై వైద్యాధికారి సురేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఉపయోగకరంగా, అన్ని అవసరమైన వసతులతో భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

మొక్కలు నాటిన మానవతా సంస్థ



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, అక్టోబర్ 1)

గిద్దలూరు పట్టణంలో మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ఆవరణలో పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ పఠాన్ హబీబ్ ఖాన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో మానవతా సభ్యులు పాలుగుల్ల శివారెడ్డి, గొంట్లా వెంకటేశ్వర్లు, స్వచ్ఛంద సేవకులు నారాయణరెడ్డి, దర్శి రమేష్ బాబు, సురభయ్య, తదితరులు పాల్గొన్నారు.

సేవా సంకల్ప్ యాత్రకు ఎమ్మెల్యే ఏలూరి కార్యాలయం వద్ద ఘన స్వాగతం

యువ బైకర్లకు ఎమ్మెల్యే ఏలూరి అభినందనలు, శుభాకాంక్షలు

మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ దేశానికి స్ఫూర్తిదాయకం

దేశ సేవలో యువత భాగస్వామ్యం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, అక్టోబర్ 1)

ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా సేవలో 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నేతలు చేపట్టిన 'సేవా సంకల్ప్' బైక్ యాత్రకు పర్చూరులో ఘన స్వాగతం లభించింది. సెప్టెంబరు 30న తిరుపతి అలిపిరి నుంచి ప్రారంభమైన యాత్ర గురువారం పర్చూరు చేరుకుంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయం వద్ద కార్పొరేషన్ డైరెక్టర్లు, తెదేపా నాయకులు, కార్యకర్తలు యువ బైకర్లకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు యాత్రలో పాల్గొంటున్న యువ బైకర్లను అభినందించి, యాత్ర విజయవంతంగా సాగాలని శుభాకాంక్షలు తెలిపారు. దేశ సేవలో ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రస్థానాన్ని ప్రజలకు తెలియజేసే లక్ష్యంతో యువత చేపట్టిన ఈ యాత్ర అభినందనీయమన్నారు.

ప్రజా సేవకు మోదీ జీవితం అంకితం

ఎమ్మెల్యే ఏలూరి

ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లుగా దేశ సేవకు అంకితభావంతో పనిచేస్తున్నారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని మోదీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి, దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.

సుపరిపాలనతో అభివృద్ధికి బాటలు

దేశంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిబద్ధతతో సుపరిపాలన అందిస్తున్నారని ఏలూరి పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని అన్నారు. దేశ సేవ పట్ల యువతలో స్ఫూర్తి నింపేలా 'సేవా సంకల్ప్' యాత్ర సాగడం అభినందనీయమన్నారు.

తిరుపతి నుంచి కాశీకి..


ఎనిమిది రోజులపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల మీదుగా సుమారు 1,930 కిలోమీటర్లు సాగనున్న యాత్ర అక్టోబరు 7న వారణాసికి చేరుకోనుంది. కృష్ణా, గోదావరి నదుల నుంచి సేకరించిన జలాలను కలశాల్లో తీసుకెళ్లి కాశీ విశ్వనాథునికి సమర్పించనున్నారు. యువత చేపట్టిన ఈ సేవా సంకల్ప యాత్ర విజయవంతంగా పూర్తి కావాలని ఎమ్మెల్యే ఏలూరి ఆకాంక్షించారు. ఈ బైక్ యాత్రలో శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, వివిఎం ఆర్డీఏ. చైర్మన్ ప్రణవ్ గోపాల్ తో పాటు 24 మంది బైక్ రైడర్స్ , తెలుగుదేశం పార్టీ నేతలు, తెలుగు యువత టి ఎన్ ఎస్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు. వీరికి తెలుగుదేశం పార్టీ నేతలు మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకట్రావు, కార్పొరేషన్ డైరెక్టర్లు మాలెంపాటి సత్యనారాయణ, కారుమంచి కృష్ణ ,షేక్ శంషుద్దీన్, మండల పార్టీ అధ్యక్షులు శివరాత్రి శ్రీనివాసరావు, కొల్లా శ్రీనివాసరావు, తారక రామారావు, నాయకులు బోడెపూడి సుబ్బారావు, కామేపల్లి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగానికి నివాళిగా 1700 కి.మీ. సైకిల్ యాత్ర

14 జిల్లాలు..1700 కిలోమీటర్లు..పర్యాటక ప్రాంతాల సందర్శన..

ఎకో ఫ్రెండ్లీ సందేశంతో సైకిల్ యాత్ర

బుచ్చిరెడ్డిపాలెం ఆర్యవైశ్య యువకుడు గుర్రం చైతన్యకు మైదుకూరు ఆర్యవైశ్య సభ ఘన సన్మానం



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, అక్టోబర్ 1)

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించుకుంటూ నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన ఆర్యవైశ్య యువకుడు గుర్రం చైతన్య చేపట్టిన సైకిల్ యాత్రకు విశేష స్పందన లభిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని సుమారు 14 జిల్లాల్లో 1700 కిలోమీటర్ల మేర సైకిల్‌పై ప్రయాణిస్తూ, ఆయా ప్రాంతాల్లోని చారిత్రక, ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాలను సందర్శిస్తూ ఈ యాత్ర కొనసాగుతోంది. పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే ఎకో ఫ్రెండ్లీ కాన్సెప్ట్‌తో గుర్రం చైతన్య ఈ సైకిల్ యాత్రను చేపట్టారు. సైకిల్ ప్రయాణం ద్వారా ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించడంతో పాటు, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను ప్రజలకు పరిచయం చేయడం ఈ యాత్రలో మరో ముఖ్య ఉద్దేశంగా ఆయన పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణకు కారకుడైన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని నేటి తరానికి గుర్తుచేస్తూ, ఆయనకు ఈ సైకిల్ యాత్రను అంకితం చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ, ఎండ, వర్షాలను లెక్కచేయకుండా సైకిల్‌పై సుదీర్ఘ ప్రయాణం సాగించడం ద్వారా చైతన్య యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా మైదుకూరు ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో గుర్రం చైతన్యను ఘనంగా సన్మానించి, శాలువాతో సత్కరించి, పండ్లు అందజేశారు. ఆయన చేపట్టిన యాత్ర విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఆర్యవైశ్య సభ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం వర్కింగ్ కమిటీ అధ్యక్షులు యెలిశెట్టి గురు ప్రసాద్, ఆర్యవైశ్య సభ ఉపాధ్యక్షులు దొంతు వెంకటసుబ్బయ్య, ఆర్యవైశ్య రాష్ట్ర సేవాదల్ సెక్రెటరీ కరమలపుటి రెడ్డి భార్గవ్, ఆర్యవైశ్య సభ సభ్యులు నూకల సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించుకుంటూ, యువతలో సైక్లింగ్‌పై ఆసక్తిని పెంపొందిస్తూ, పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్న గుర్రం చైతన్య ప్రయత్నం అభినందనీయమన్నారు. ఇలాంటి స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలకు సమాజం నుంచి మరింత ప్రోత్సాహం లభించాలని ఆకాంక్షించారు. పొట్టి శ్రీరాములు త్యాగస్ఫూర్తి.. పర్యావరణ పరిరక్షణ..ఆంధ్రప్రదేశ్ పర్యాటక వైభవం అనే మూడు అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఈ సైకిల్ యాత్ర సాగుతుండటం విశేషమని వారు పేర్కొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తిమ్మరాజుపాలెంలో ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఏలూరి

పల్లె పండుగలో రూ.60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభం

గామస్తులతో మమేకమైన ఎమ్మెల్యే ఏలూరి





(షణ్ముఖ వెలుగు, పర్చూరు, అక్టోబర్ 1)

పేదల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో గురువారం ఆయన ఇంటింటికీ తిరుగుతూ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర లబ్ధిదారులతో మాట్లాడి వారికి అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. పేదవాడికి నెలవారీ ఖర్చులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రతి నెల ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పింఛను కోసం వృద్ధులు, దివ్యాంగులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తున్నామని చెప్పారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా తిమ్మరాజుపాలెం గ్రామంలోని నర్రా సుబ్బారావు కాలనీలో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రారంభించారు. రోడ్ల నిర్మాణంతో కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందులు తొలగనున్నాయని, వర్షాకాలంలో బురద, గుంతల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు.

ప్రజల సమస్యలపై ఆరా

పింఛన్ల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తమకు ఎదురవుతున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలతో పాటు గ్రామాల అభివృద్ధికి చేపడుతున్న పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పల్లెలను మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు.

సీనియర్ సిటిజన్ బెల్లంకొండ మీరావలికి ఘన సన్మానం

వృద్ధుల సంక్షేమం అందరి బాధ్యత

మన భవిష్యత్తుకు దారి చూపేది పెద్దలు అనుభవమే

నవ్వులు, పువ్వులు వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 1)

పొదిలి జూనియర్ కాలేజీ గ్రౌండ్ లో నవ్వులు పువ్వుల సంఘం అధ్యక్షులు షేక్ మదార్ వలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ జనాభాలో 35% వృద్ధులు చాలా ఇబ్బందులలో ఉన్నారని, వారు గ్రామాల్లో జీవిస్తూ, ఆర్థిక, సామాజిక అనారోగ్యాలతో బాధపడుతున్నారని, శరీరంలో సత్తువ తగ్గి సంపాదించలేక ఆకలితో అలమటిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వాలు ప్రతి మండల కేంద్రంలో ఈ వృద్ధులకు ఉచిత వైద్యం, ఆర్టీసీ బస్సులలో రైల్వేలలో రాయితీలు కల్పించాలన్నారు. ప్రతి బ్యాంకులో క్యూలైన్ తో నిమిత్తం లేకుండా సీనియర్ సిటిజనులకు లావాదేవీలు జరిపే సదుపాయం కల్పించాలని, ప్రభుత్వ కార్యాలయాలలో, పోలీస్ స్టేషన్లలో వృద్ధులను గౌరవించటం మన బాధ్యత అనే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వృద్ధాప్యం వచ్చిందనే ఆలోచన మనసులోకి రానీయకుండా ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ, ఉదయం నడక తేలికపాటి వ్యాయామాలు సమాజ సేవ చేస్తూ, నవ్వుతూ నవ్విస్తూ హుషారుగా ఉంటున్నామని రిటైర్డ్ తెలుగు పండిట్ గోవిందయ్య ఏఎంసీ సూపర్వైజర్ భాషా మొహిద్దిన్ అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మదార వలి, గోవిందయ్య, భాషా మొహిద్దిన్, భుట్టోజిలాని,సుదర్శన రెడ్డి, షేక్ జిలాని, మజున్సా, చిన్న రాజు, తోట నారాయణ, ప్రసాదు, గుంటూరు మేస్త్రి, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

15వ వార్డులో ఎన్టీఆర్ పింఛన్ పంపిణీ


పెద్దలకు భరోసా ఇచ్చిన యాగంటి

ప్రతి ఇంటికీ వెళ్లి పింఛన్ అందించిన మాజీ చైర్మన్



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 1)

కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న చీ= భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమం మాచర్ల పట్టణం 15వ వార్డులో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు ముఖ్య అతిథిగా పాల్గొని, వార్డులోని అవ్వాతలకు స్వయంగా పింఛన్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా యాగంటి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రూ.1000 కూడా సరిగ్గా ఇవ్వకుండా అవ్వా తాతలను అవమానించారు. కానీ మన చంద్రబాబు, మన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఒక్కొక్కరికి రూ.4000 పింఛన్‌ను గౌరవంగా ఇంటి వద్దకే తీసుకొచ్చి అందిస్తున్నాం. ఇది పింఛన్ కాదు.. పెద్దల పై మనకున్న గౌరవం అని అన్నారు. పింఛన్ తీసుకున్న అవ్వాతాతలు ఆనందంతో "చంద్రబాబు నాయుడు, బ్రహ్మన్న, యాగంటి కి దేవుడు మంచి చేయాలి అంటూ దీవించారు.అనంతరం వార్డులోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, ఏ సమస్య ఉన్నా నేరుగా తనకు చెప్పాలని, వెంటనే మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని యాగంటి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు కూటమి నాయకులు, బూత్ ఇన్చార్జులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



మైదుకూరు నియోజకవర్గంలో తొలి ఎంపీటీసీ అభ్యర్థి ప్రకటన

వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా బొజ్జ ఓబయ్య యాదవ్



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, అక్టోబర్ 1)

మైదుకూరు నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున తొలి ఎంపీటీసీ అభ్యర్థిని ప్రకటించినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. జివి సత్రం పరిధిలోని ఎన్ యర్రబల్లె పంచాయతీకి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన బొజ్జ ఓబయ్య యాదవ్ పేరును మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రకటించినట్లు పేర్కొన్నారు. మైదుకూరు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో బొజ్జ ఓబయ్యతో పాటు ఆయన అనుచరులు సుమారు 20 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా శెట్టిపల్లె రఘురామిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొజ్జ ఓబయ్య యాదవ్‌కు ఎంపీటీసీ అభ్యర్థిత్వం ప్రకటిస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున ఆయన పోటీ చేయనున్నట్లు రఘురామిరెడ్డి వెల్లడించారు. పార్టీలో చేరిన కుటుంబాలకు పార్టీ నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, బొజ్జ ఓబయ్య అనుచరులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో రాజకీయ కార్యకలాపాలు ఊపందుకుంటున్న సమయంలో ఈ అభ్యర్థి ప్రకటన, పార్టీలో చేరికలు చోటుచేసుకున్నాయి.

చిన్న అలవలపాడు ఎంపిపిఎస్ పాఠశాలలో ఘనంగా పాఠశాల కమిటీ ఎన్నికలు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, అక్టోబర్ 1)

మండలంలోని చిన్న అలవలపాడు ఎంపిపిఎస్ పాఠశాలలో గురువారం పాఠశాల కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా యువమోర్చా మార్కాపురం జిల్లా అధ్యక్షులు మల్లెల గోమ్స్ హాజరయ్యారు. ఈ ఎన్నికల్లో పాఠశాల కమిటీ చైర్మన్‌గా సాలమ్మ, వైస్ చైర్మన్‌గా జాన్సీ ఎన్నికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పల్లాల అనురాధ, ఉపాధ్యాయులు చెరుకూరి ఓంకార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన చైర్మన్ సాలమ్మ, వైస్ చైర్మన్ జాన్సీలను మల్లెల గోమ్స్ శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతో పాఠశాలను మరింత అభివృద్ధి చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు తన వంతు సహకారం అందిస్తానని మల్లెల గోమ్స్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా కొమెరా వీరాస్వామి, వెంకమ్మ వర్ధంతి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 1)
కమ్యూనిస్టు నేత కామ్రేడ్ కొమెర వీరాస్వామి, వెంకమ్మ వర్ధంతిని గురువారం సిపిఐ కార్యాలయంలో ఏరియా సెక్రటరీ మేకపోతుల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ హాజరయ్యారు. ముందుగా వీరాస్వామి చిత్రపటానికి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. నియోజకవర్గంలో సిపిఐ, పార్టీ అనుబంధ సంఘాల కార్మికుల కోసం పాటుపడిన వ్యక్తులు కొమెర వీరస్వామి దంపతులన్నారు. కమ్యూనిస్టు భావజాలంతో మాచర్లలో ఎన్నో ఉద్యమాలను నిర్వహించి, పట్టణంలోని ఆజాద్ నగర్, రైలు కట్ట, చిన్ని నాయుడు కాలనీ వంటి ఎన్నో శివారు కాలనీలలో ఆయన వందలాది మందికి ఇళ్ల పట్టాలను ఇప్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వీరాస్వామి ఉద్యమ ఫలితంగానే మాచర్ల కు రైలు రావడం సాధ్యమైందని, కెసిపిలో యూనియన్ లీడర్‌గా, సిపిఐ కౌన్సిలర్‌గా, ఏఐటీయూసీ లీడర్‌గా సేవలందించడంతో పాటు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ కార్యాలయాన్ని నిర్మించిన ఘనత ఆయనదేనన్నారు. అనంతరం మాచర్ల, గురజాల ఏరియా సెక్రెటరీలు మేకపోతుల శ్రీనివాసరెడ్డి, మందపాటి రమణారెడ్డి, కొమెరా వెంకట్రావు, ఎంసిపిఐ నాయకులు అబ్రహం లింకన్, ఎం.సిపిఐయు నాయకులు మాచవరపు నాగేశ్వరరావు, బత్తిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వీరస్వామి, వెంకమ్మ దంపతులు నిబద్ధత కలిగిన వ్యక్తులని, కమ్యూనిస్టు పార్టీ కోసం వారు చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. వారు నిత్యం కార్మికులతో మమేకమై సమస్యల పట్ల ఎనలేని పోరాటం చేశారన్నారు. విధి నిర్వహణలో కార్మికులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ కార్మికులకు అండగా నిలిచారన్నారు. అలాంటి గొప్ప వ్యక్తుల వర్ధంతిని కార్యాలయంలో కార్మికుల మధ్య జరుపుకోవడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాచర్ల, రెంటచింతల, దుర్గి, కార్యదర్శిలు మిద్దెపోగు బాబురావు, కేతావత్ రంగనాయకులు, కాళా శివయ్య, ఏఐవైఎఫ్ నాయకులు సర్రా రంగస్వామి, చిన్న రామయోగి, బ్రహ్మచారి, వీర బ్రహ్మచారి, కందుకూరి కిరణ్, వీరాచారి, చిన్న యేసు, వెంకటనారాయణ, దేవ దేవళ్ల రోశయ్య, అంజి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ దేవి శరన్నవరాత్రుల మహోత్సవ పోస్టర్ ఆవిష్కరించిన మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 1)
ఈ నెల 11 వ తేదీ నుండి అక్టోబర్ 20 వ తేదీ వరకు చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో జరగనున్న దసరా నవ రాత్రుల వేడుకల పోస్టర్ ను మాజీమంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మి పద్మావతి దంపతులు ఒంగోలులోని వారి నివాసంలో గురువారం ఉదయం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మ కర్తలు శిద్దా రాఘవరావు మాట్లాడుతూ శిద్దా వెంకట సుబ్బమ్మ, వెంకటేశ్వర్లు ట్రస్ట్ ఆధ్వర్యంలో దసరా శరన్నవ రాత్రుల వేడుకలు చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తునట్లు తెలిపారు. అక్టోబర్ 11 ఆదివారం సాయంత్రం 6.30 నిముషాలకు బాల త్రిపుర సుందరి దేవి అలంకారంతో శ్రీ హరి హర క్షేత్రంలో ప్రారంభం అవుతాయని, ప్రతి రోజు అమ్మవారు వివిధ అలంకారాలతో భక్తులకు దర్శన భాగ్యంతో పాటు అమ్మవారికి విశేష పూజలు, ప్రతి రోజు శ్రీ వాసవి అమ్మవారికి పంచామృత అభిషేకం, శ్రీ చక్ర నవార్చన, తీర్థ ప్రసాదాలు, శిద్దా లక్ష్మి పద్మావతి ఆధ్వర్యంలో ఉభయ దాతల పూజలు, ఆర్యవైశ్య మహిళా భక్తులచే సామూహిక శ్రీ లలిత సహస్ర నామ పారాయణం, కుంకుమ పూజలు, నిత్యం అన్న ప్రసాద వినియోగం ఉంటుందని శిద్దా రాఘవరావు తెలిపారు. శిద్దా వెంకటేశ్వర్లు, శిద్దా వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, వాహన సౌకర్యం ధర్మ కర్తలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీ హరిహర క్షేత్రంలో జరిగే శ్రీదేవి శరన్నవ రాత్రి మహోత్సవంలో భక్తులు పాల్గొని అమ్మవారి వారి ఆశీస్సులతో పాటు కృపాకటాక్షాలు పొందగలరని కోరుతున్నట్లు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీమాన్ వెంకట హరి కుమరా చార్యులు, ఆలయ మేనేజర్ అద్దంకి రామచంద్రమూర్తి, ఆలయ ఇంచార్జి ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్థిరపడిన వారు పేదలకు తమ వంతు
సహాయ, సహకారాలు అందించాలి
ప్రకాశం జిల్లా కలెక్టర్, పి రాజాబాబు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, అక్టోబర్ 1)
పి4 కార్యక్రమం ద్వారా సమాజంలో అసమానతలు తొలగించే విధంగా అన్ని రకాలుగా స్థిరపడినవారు పేదలకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని పి రాజాబాబు పేర్కొన్నారు. గురువారం చాకలి పాలెం, మద్దిపాడు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను స్థానిక ఎమ్మెల్యే విజయ కుమార్ తో కలిసి కలెక్టర్ పి రాజాబాబు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన పేదల సేవలో 2.0 కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్జీ దారుల నుండి సుమారు 82 అర్జీలను స్వీకరించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల యొక్క అవసరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రతినెలా మొదటి తారీకు లేదా మొదటి తారీకు ప్రభుత్వ సెలవు దినం అయితే ముందు రోజు గానే పింఛన్లు పంపిణీ తో పాటు ప్రజా సేవలో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. ప్రజా సేవలో కార్యక్రమం ఇక్కడి నుంచే మొదలుపెట్టడం జరిగింది అన్నారు. ఇందులో భాగంగా సంక్షేమ శాఖల అధికారులు ఆయా శాఖల అభివృద్ధి పథకాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. గ్రామం తద్వారా మండలం రాష్ట్ర అభివృద్ధి జరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా మొత్తం మీద సుమారు రెండు లక్షల పదహారు వేల మందికి 94 కోట్ల మేర పింఛన్లు అందజేయడం జరుగుతుందన్నారు. వి బి జి రాంజీ కార్యక్రమం కింద 100 కోట్ల నిధులు నుండి 140 కోట్ల వరకు అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గ్రామాలకు లింకు రోడ్లు ఇప్పటి వరకు రహదారులు విస్తరణ కై రూ.20 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గం మొత్తం మీద రూ.110 కోట్ల మేర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. సర్వీస్ రోడ్లు, తారు రోడ్లు ఏర్పాటు చేయుట ద్వారా రైతులకు ఆర్థికంగా ఎంతో మేలు జరిగిందన్నారు. భూముల విలువలు పెరిగాయన్నారు. తల్లికి వందనం కార్యక్రమం ద్వారా రూ.40 కోట్ల మేర సంవత్సరానికి నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా చాలా మంది పేదలకు వైద్యానికి నిమిత్తం నిధులు అందించడం జరుగుతుందన్నారు. ఆర్థికంగా ఎదిగిన వారు సమాజ స్థాపన కోసం పేదలకు ఇతోదికంగా తమ వంతు సహాయ, సహకారాలు అందించినప్పుడు మనస్శాంతిగా ఉంటుందన్నారు. తన వంతుగా స్మశానవాటిక, పేదల ఇంటి వసతి కోసం మూడు ఎకరాల స్థలాన్ని ఇవ్వడం జరుగుతుందని, అదే విధంగా స్మశాన వాటిక ఏర్పాటు జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, మండల ప్రత్యేక అధికారి మాధురి, ఈడీ బీసీ కార్పొరేషన్ వెంకటేశ్వరరావు, డిపిఓ అనుపమ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణ, వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యేతో కలిసి సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించారు.









ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి
జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి
అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశం
సభా ప్రాంగణం, హెలిప్యాడ్‌లను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ









(షణ్ముఖ వెలుగు, ప్రొద్దుటూరు, అక్టోబర్ 1)
జలజీవన్ మిషన్ ప్రాజెక్టుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 5వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ప్రొద్దుటూరుకు రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. గురువారం ప్రొద్దుటూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనాలతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో పర్యటన ఏర్పాట్ల పై ఆయన శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సభా ప్రాంగణం, వేదిక, బారికేడింగ్, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, వైద్యం, అగ్నిమాపక, భద్రత తదితర అంశాల్లో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

భద్రతపై ప్రత్యేక దృష్టి

ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ : ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలు, పార్కింగ్ ప్రాంతాల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

పర్యటనను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలిసారిగా ప్రొద్దుటూరుకు వస్తున్నారని, ఈ పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కోరారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా : ఏ శాఖకు కేటాయించిన విధులను ఆ శాఖ అధికారులు ఎక్కడా పొరపాట్లకు తావివ్వకుండా, పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ అధికారులకు మార్గదర్శనం చేశారు.

సభా ప్రాంగణం, హెలిప్యాడ్ పరిశీలన : సమీక్షా సమావేశానికి ముందు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ, జాయింట్ కలెక్టర్లు అధికారులతో కలిసి బహిరంగ సభ ప్రదేశాన్ని, హెలిప్యాడ్ స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ షేక్స్ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వి ఎస్ ముక్తియార్, ప్రొద్దుటూరు ఏ ఎస్పీ శ్రీకృష్ణ, జమ్మలమడుగు, కడప, బద్వేల్, పులివెందుల ఆర్డీఓలు శిరీష, చంద్రశేఖర్, చిన్నయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్ ఇర్విన్, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బి, ఈపీడీసీఎల్ ఎస్ఈలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పల్లె పండుగ 3.0తో మౌలిక వసతుల పనులకు ప్రాధాన్యత



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, అక్టోబర్ 1)
పల్లె పండుగ 3.0తో గ్రామాల్లో పెద్ద ఎత్తున మౌలిక వసతుల పనులు చేపట్టనున్నట్లు మండల ఎంపిడిఓ కె.ధనలక్ష్మి తెలిపారు. గురువారం మండలంలోని సంతరావురు గ్రామంలో ఎంపిడిఓ కె ధనలక్ష్మి అధ్వర్యంలో ఎపోఓ లక్ష్మీ కుమారి పర్యవేక్షణలో రూ.4 లక్షల విలువ చేసే క్యాటిల్ షెడ్స్‌కు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పోద వీరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండుగ 3.0లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, పశుసంవర్ధక రంగం, ఉద్యాన పంటలు, గ్రామ పంచాయతీ మౌలిక వసతులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె ధనలక్ష్మి, మండల టిడిపి పార్టీ అధ్యక్షులు నరహరి శ్రీనివాసరావు, మండల పార్టీ నాయకులు పోద వీరయ్య, యార్లగడ్డ లక్ష్మీ, ఎమ్ఎస్ఓ శ్రీనివాసరావు, ఎపిఓ జె లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి కృపారావు, సందు శ్రీనివాసరావు, మోటుమర్రి రామసుబ్బారావు, నబిషా, తుమ్మలపెంట జయరావు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగా మంజూరైన వితంతు పెన్షన్ పంపిణీ




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 1)
మండలంలోని కరేడు గ్రామం టెంకాయచేట్లపాలెం గ్రామానికి చెందిన దివంగత టీడీపీ సీనియర్ నాయకుడు కారుమంచి పెనుగొండయ్య సతీమణి కారుమంచి తిరుపతమ్మకి కొత్తగా వితంతు పెన్షన్ మంజూరైంది. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు కరేడు గ్రామ టీడీపీ అధ్యక్షుడు నేలటూరి ఆదాము కొత్తగా మంజూరైన వితంతు పెన్షన్‌ను కారుమంచి తిరుపతమ్మకి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం పింఛన్లను ప్రతి నెల 1వ తేదీనే పంపిణీ చేస్తోందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కారుమంచి ప్రకాశం, జయపాల్, గోవింద్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కొండేపిలో పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నాం

కొండేపి నియోజకవర్గానికి 229 ఇళ్లు మంజూరు
లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేత
అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన
పిఎంఏవై పథకం కింద ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీలో మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి







(షణ్ముఖ వెలుగు, కొండపి, అక్టోబర్ 1)

కొండేపి మండల పరిధిలో ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు గృహ నిర్మాణ అనుమతి, మంజూరు పత్రాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి శోధనాత్మకంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కొండేపి నియోజకవర్గంలో పిఎంఏవై 2.0 (ఉడా) పథకం కింద మొత్తం 229 నూతన గృహాలు మంజూరయ్యాయని వెల్లడించారు. ఇందులో గ్రామాల వారీగా కొండేపి గ్రామానికి 68, పొన్నలూరు మండలం వేంపాడు గ్రామానికి 11, సింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామానికి 24, పాకల గ్రామానికి 45, టంగుటూరు మండలం టంగుటూరు గ్రామానికి 54, అలాగే జరుగుమల్లి మండలం కె బిట్రగుంట గ్రామానికి 27 గృహాలు మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు. మిగిలిన గ్రామాల్లో ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరికీ రాబోయే 10 రోజుల్లో మంజూరు పత్రాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఒక్కో గృహానికి యూనిట్ ఖర్చు రూ.2,50,000 (పూర్తి సబ్సిడీ) అని, ఇందులో కేంద్ర ప్రభుత్వం సహాయం రూ.1,50,000 (60%), రాష్ట్ర ప్రభుత్వం సహాయం రూ.1,00,000 (40%) గా ఉందని తెలిపారు. ఈ 229 గృహాలకు సంబంధించి మొత్తం ప్రాజెక్ట్ కాస్ట్ రూ.5.725 కోట్లు కాగా, అందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.3.435 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2.290 కోట్లుగా ఉందన్నారు. దీనికి అదనంగా కన్వర్జెన్స్ ప్రయోజనాల కింద ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ద్వారా 90 పని దినములకు రూ.27,000, ఎస్బిఎం (గ్రామీణ్) ద్వారా ఐహెచ్హెచ్ఎల్ కు రూ.12,000 కలిపి మొత్తం రూ.39,000 వరకు అదనపు సహాయం ఉడా ప్రాంతాల్లో అందిస్తున్నామని, దీంతో ఒక్కో ఇంటికి మొత్తం యూనిట్ కాస్ట్ రూ.2,89,000 (రూ.2.50 + రూ.0.39 లక్షలు) అవుతుందని వివరించారు. నిర్మాణ దశల వారీగా లబ్ధిదారుల చెల్లింపులు నేరుగా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో ఆన్లైన్ పేమెంట్ విధానంలో జమ అవుతాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు అదనంగా రాయితీలు ఇస్తున్నామని, గత ప్రభుత్వంలో ఆగిపోయిన ఇళ్లకు కూడా తమ ప్రభుత్వం వచ్చాక నిధులు చెల్లించి అండగా నిలిచామని మంత్రి గుర్తుచేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మరియు కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడమే కాకుండా విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ఊరట కలిగిస్తోందని మంత్రి అన్నారు. కొండేపి ఆసుపత్రిని ఆధునీకరించి ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు, కాన్పులు, ఆపరేషన్లు అందిస్తున్నామని వివరించారు. నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణం, డ్రైనేజీలు, మంచినీటి సమస్య పరిష్కారానికి పైప్లైన్ల ఏర్పాటు, చిలకలగుంట, జాళ్లపాలెం రోడ్డులో రూ.100 కోట్లతో విద్యుత్ స్టేషన్ నిర్మాణం వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, రూ.6,000 వరకు పెన్షన్ల పంపిణీ, అన్నదాత సుఖీభవ కింద ఆర్థిక సాయం, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, పంచాయతీ ఆఫీసుల ద్వారా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం పంపిణీ, పేద విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకం ద్వారా నిధుల జమ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. నియోజకవర్గంలో మిగిలిపోయిన అభివృద్ధి పనులన్నింటినీ రాబోయే రోజుల్లో పూర్తి చేసి, ప్రజలందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ పి శ్రీనివాసప్రసాద్, డిఈ

ప్రభుత్వ స్కూల్ ముద్దు.... ప్రైవేట్ స్కూల్ వద్దు

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తల్లిదండ్రుల సహకారం అవసరం

మాచర్ల ఏఎంసి మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు





(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 1)

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు తల్లిదండ్రులు కూడా తమ వంతు సహకారం అందించాలని మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లిఖార్జునరావు పిలుపునిచ్చారు. మాచర్ల పట్టణంలోని నెహ్రూనగర్ ఎంపీపీఎస్ పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల త్రాగు నీటి సౌకర్యార్థం యాగంటి మల్లిఖార్జునరావు ఏర్పాటు చేసిన త్రాగునీటి ట్యాంకును ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం అభినందించింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సంతకంతో ప్రభుత్వం తరఫున అందించిన ప్రశంసాపత్రాన్ని పాఠశాల హెచ్ఎం కేశవరెడ్డి, ఉపాధ్యాయులు ఏడుకొండలు, విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి యాగంటి మల్లిఖార్జునరావుకు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యాగంటి మల్లిఖార్జునరావు మాట్లాడుతూ సమాజంలో పేదరిక నిర్మూలనకు, అభివృద్ధికి విద్యే ప్రధాన మార్గమని అన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రభుత్వాలు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలో పలు సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం, షూ, సాక్సులతో పాటు మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేపడుతున్న సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని యాగంటి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు విద్యాబోధనపై దృష్టి సారించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే విధులను తొలగించి,వారిని విద్యాబోధనకే పరిమితం చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు, విద్యా విధానాలపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెరుగుతోందని, గతంతో పోలిస్తే సుమారు 1.10 లక్షల మంది విద్యార్థులు అదనంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరినట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాలల్లో చిన్నచిన్న మౌలిక వసతుల కల్పనకు ప్రతిసారీ ప్రభుత్వంపై ఆధారపడకుండా తల్లిదండ్రులు కూడా తమ వంతు సహకారం అందించాలని యాగంటి కోరారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందితే భవిష్యత్తులో సాఫ్ట్వేర్, ఉక్కు, సిమెంట్ తదితర రంగాల్లో రాష్ట్రానికి వచ్చే పారిశ్రామిక పెట్టుబడుల ద్వారా యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. పిల్లలకు మంచి భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని యాగంటి మల్లిఖార్జునరావు పేర్కొన్నారు.

పేదరికం, ఆర్థిక అసమానతలను తగ్గించడమే లక్ష్యం


ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్రావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 1)

పేదరికం, ఆర్థిక అసమానతలను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్రావు అన్నారు. పి4 కార్యక్రమం పై గురువారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు అందుతున్న సంక్షేమ పథకాలన్నింటినీ సమన్వయం చేసి వారికి గరిష్ఠ ప్రయోజనం కల్పించడంతో పాటు, పేదరికం, ఆర్థిక అసమానతలను తగ్గించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "పేదల సేవలో 2.0" కార్యక్రమంలో భాగంగా ఒంగోలు నగరంలోని 30వ డివిజన్ హిల్ టవర్స్ ప్రాంతం నందు పర్యటించి ముందుగా లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేపట్టారు. అనంతరం డివిజన్లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో స్త్రీశక్తి, తల్లికి వందనం, దీపం వంటి పథకాల ద్వారా పేద కుటుంబాలకు అందుతున్న తీరు, పి4 కార్యక్రమం ద్వారా డివిజన్లలో పేద కుటుంబాలకు మార్గదర్శకులను అనుసంధానం చేసి, వారి అభివృద్ధికి తీసుకుకుంటున్న చర్యల పై సమీక్షా చేపట్టారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత నగరంలో ప్రధాన రోడ్లు విస్తరణ చేపట్టడం, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు జనార్దన్ తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. నగర అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, గత నెలలో 70 కోట్ల రూపాయలు చంద్రబాబు నాయుడు కేటాయించడం జరిగిందని గుర్తు చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.










చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని ఒంగోలు కలెక్టర్ వద్ద కాంగ్రెస్ నిరసన

ఓట్ల దొంగ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలి

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా డిమాండ్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 1)

భారత చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ గురువారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కాంగ్రెస్ పతాకాలను చేబుని ఓట్ల దొంగ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలనే నినాదాలతో కూడిన ప్లేకార్డులతో అంబేద్కర్ విగ్రహం నుండి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం, చర్చి సెంటర్, కలెక్టరేట్ వరకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించి కలెక్టరేట్ వద్ద బయటాయించి పెద్ద ఎత్తున నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ముసుగులో ప్రతిపక్ష పార్టీల ఓట్లను తొలగించడం దుర్మార్గ మైన చర్యని, దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల పైచిలుకు ఓట్లను తొలగించారని, అలాగే ఆంధ్రప్రదేశ్లో దాదాపు 89 లక్షల ఓట్లను తొలగించేందుకు బిజెపి ప్రభుత్వం కంకణం కట్టుకుందని ఈ విషయాన్ని బయటపెట్టిన ఇండియన్ ఎక్స్ప్రెస్ జర్నలిస్టు చరిత చోప్రో ని అభినందిస్తున్నామని సైదా అన్నారు. గత రెండు సంవత్సరాలుగా రాహుల్ గాంధీ వివిఎంలు ట్యాంపరింగ్ జరుగుతున్నాయని, బ్యాలెట్ల ద్వారానే ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నారని సైదా అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఈదా సుధాకర్ రెడ్డిలు మాట్లాడుతూ ఓట్ చోరీ ద్వారానే గత 14 సంవత్సరాలుగా మోడీ పరిపాలిస్తున్నారని వారు దుయ్యబట్టారు మోడీ దిగిపోయే రోజు దగ్గర్లోనే ఉందని వారు ఇరువురు అన్నారు. ఒంగోలు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవిరెడ్డి ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ జ్ఞానేశ్వర్ పదవీకాలంలోనే 14 పర్యాయాలు సహా ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు చెప్పిన వారి మాటను పెడచెవిన పెట్టి ఎన్నికల సంస్కరణల పేరుతో బిజెపికి మేలు కూర్చే పనులు చేపట్టారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో కొండేపి నియోజకవర్గ సమన్వయకర్త శ్రీపతి సతీష్, రాష్ట్ర మైనార్టీ డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షులు సయ్యద్ రఫీ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ రసూల్, వేణుగోపాల్ రాజు, గోరంట్ల కోటేశ్వరరావు, పిల్లి వెంకటేశ్వరరెడ్డి, బుజ్జి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఇరిగినేని వెంకట నరసయ్య, పైనం మధు, షేక్ రఫూఫ్, జీవయ్య, శ్రీనివాసరాజు, జిల్లా మైనార్టీ డిపార్ట్మెంట్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు షేక్ మహబూబ్ అలీ, జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ మన్నం ప్రసన్నరాజు, రాష్ట్ర ఎన్ఎస్యుఐ ఉపాధ్యక్షులు చందు నాయక్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు కొప్పోలు సుబ్బారావు, ఉంగరాల శ్రీనివాసరావు, పొదిలి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే వరప్రసాద్ బాబు, మార్కాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ ఇమ్రాన్, తర్లపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ హుస్సేన్, యువజన నాయకుడు వెంకట్, కోటిరెడ్డి, ప్రసాద్, ఖాదర్ వలీ, తదితరులు పాల్గొన్నారు.

ఏఏ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్గా గురిజాల చిన్న ఏకగ్రీవంగా ఎన్నిక



(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, అక్టోబర్ 1)

మండల కేంద్రమైన మర్రిపూడి ఏఏ పాఠశాల విద్యా కమిటీ నూతన చైర్మన్గా ఏకగ్రీవంగా గురిజాల చిన్న ఎంపికయ్యారు. వైస్ చైర్మన్గా రెండవసారి గండి అన్నమ్మ ఏకగ్రీవంగా ఎన్నిక చేయబడింది. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయురాలు విజయ దుర్గ నూతన కమిటీ నియమకాన్ని నియమించి సభ్యులు ద్వారా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ చిన్న మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు గురిజాల పోలయ్య, శాంతి ఆంధ్ర పత్రిక ఎడిటర్ గురిజాల బాబురావు, నూతన కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు గురిజాల జాన్సన్, కొండ్రు జాన్, గురిజాల జార్జి, గండి నోవాహు, గండి బెంజిమెన్, కొండ్రు దావీదు, గురిజాల ప్రేమయ్య, గురిజాల నరసింహారావు, నేలపాటి నరసయ్య, విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com

తౌషిక్ మృతి.. మౌలాబి ఆత్మహత్య పై సిట్టింగ్ జడ్జిలేదా సిబిఐతో విచారణ జరపాలి

న్యాయం కోసం పోరాడిన తల్లికి న్యాయం ఏదీ?
అధికార, ప్రతిపక్షాల మౌనంపై మందా కృష్ణ మాదిగ ఆగ్రహం
ఈ నెల 12న ఒంగోలు కలెక్టరేట్ ఎదుట 'చలో ఒంగోలు-మహాధర్నా'
నిందితులను అరెస్టు చేయాలి.. న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు
బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 1)


బిడ్డ మరణానికి కారణాలేమిటో తేల్చాలని నెలల తరబడి పోరాడిన తల్లి.. చివరకు న్యాయం దక్కదనే ఆవేదనతో ఆత్మహత్యకు పాల్పడిన దుస్థితి. సయ్యద్ తౌషిక్ అనుమానాస్పద మృతి, అతని తల్లి మౌలాబి ఆత్మహత్య ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. స్థానిక పోలీసుల దర్యాప్తుపై అనుమానాలున్న నేపథ్యంలో హైకోర్టు సిట్టింగ్ జడ్జితో లేదా సీబీఐతో విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ నెల 12న ఒంగోలు కలెక్టరేట్ ఎదుట 'చలో ఒంగోల-మహాధర్నా' నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సింగరాయకొండ లోని శ్రీచైతన్య నవోదయ పాఠశాలలో ఫిబ్రవరి 11న 11 ఏళ్ల బాలుడు సయ్యద్ తౌషిక్ అనుమానాస్పదంగా మృతి చెందడం, తన కుమారుడి మరణంపై న్యాయం కోసం పోరాడిన తల్లి మౌలాబి ప్రేరేపిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలపై దోషులను శిక్షించాలని కోరుతూ గురువారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌ఛార్జి ఎస్.నరేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు, దళిత, బీసీ, మైనారిటీ, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

న్యాయం కోసం పోరాడినా.. దక్కని భరోసా....

మందా కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. తన కుమారుడి మరణానికి కారణాలేమిటో తేల్చాలని మౌలాబి నెలల తరబడి అధికారుల చుట్టూ తిరిగి న్యాయం కోసం పోరాడారని తెలిపారు. ఆమె చేసిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకొని నిష్పాక్షికంగా విచారణ జరిపి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదనే ఆవేదనను వ్యక్తం చేశారు. తౌషిక్ మృతికి దారితీసిన పరిస్థితులేమిటి? బాధ్యులెవరు? తల్లి చేసిన ఫిర్యాదులపై అధికారులు ఏం చర్యలు తీసుకున్నారు? అన్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పాఠశాల యాజమాన్యం పాత్రపైనా సమగ్ర దర్యాప్తు జరగాలని, సాక్ష్యాధారాల ఆధారంగా బాధ్యులను గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. డబ్బు, రాజకీయ పలుకుబడితో నిందితులను కాపాడుతున్నారనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ అనుమానాలను నివృత్తి చేయాలంటే విచారణను స్వతంత్ర సంస్థకు అప్పగించాలని కోరారు.

కొందరికి ఒక న్యాయం.. మరికొందరికి మరో న్యాయమా?

కందుకూరులో చిడిపోతు లక్ష్మయ్యనాయుడు కుటుంబం, ఒంగోలులో వీరయ్య చౌదరి కుటుంబాలకు సంబంధించిన ఘటనలపై రాజకీయ నాయకత్వం స్పందించిన తీరును ప్రస్తావిస్తూ మందా కృష్ణ మాదిగ ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించారు. వీరయ్య చౌదరి కుటుంబాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరామర్శించినప్పుడు, తౌషిక్ కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదని నిలదీశారు. బాధితుల సామాజిక నేపథ్యాన్ని బట్టి ప్రభుత్వ స్పందనలో తేడా కనిపిస్తోందని విమర్శించారు. దళితులు, మైనారిటీలను ఓటు బ్యాంకుగా చూడకుండా, వారికి అన్యాయం జరిగినప్పుడు ప్రభుత్వం అండగా నిలవాలని అన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి స్పందించి సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐ విచారణకు సిద్ధమని ప్రకటించాలని డిమాండ్ చేశారు . ప్రధాన ప్రతిపక్షం కూడా బాధిత కుటుంబానికి అండగా నిలిచి న్యాయ విచారణ కోసం డిమాండ్ చేయాలని అన్నారు. అధికార, ప్రతిపక్షాలు స్పందించకపోతే వాటికి అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. అదే విధంగా బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని ప్రకటించారు.



వ్యవస్థ వైఫల్యమే తల్లి ఆత్మహత్యకు కారణం
చీకటి శ్రీనివాసరావు

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ తౌషిక్ మృతి వెనుక వాస్తవాలను వెలికితీయడంలో ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం విఫలమయ్యాయని విమర్శించారు. తన బిడ్డ ఎందుకు చనిపోయాడో చెప్పాలని తండ్రి ప్రశ్నిస్తున్నా సమాధానం లేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. బిడ్డ మరణానికి కారణాలేమిటో తేల్చాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మౌలాబి నెలల తరబడి పోరాడినా న్యాయం జరుగుతుందనే భరోసా కల్పించలేకపోయారని అన్నారు. ఈ పరిస్థితుల్లో న్యాయం దక్కదనే ఆవేదనతో ఆమె ఆత్మహత్యకు



పాల్పడటం సమాజాన్ని కలచివేస్తోందని పేర్కొన్నారు. రాజ్యాంగం అందరికీ సమాన న్యాయం కల్పిస్తుందని, పేద కుటుంబానికీ అదే న్యాయం అందాలని అన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ సహా సంబంధిత అధికారులు ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, కుటుంబం చేసిన ఫిర్యాదుల పై జరిగిన దర్యాప్తు, అధికారుల స్పందన వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఒక పేద కుటుంబానికి న్యాయం చేయడంలో వ్యవస్థ విఫలమైతే ప్రజల్లో చట్టంపై నమ్మకం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనను ఒక్క కుటుంబ సమస్యగా కాకుండా బాధితులకు న్యాయం అందించాల్సిన సామాజిక బాధ్యతగా చూడాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారుస్తాం....

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధ్యక్షులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మౌలాబి మరణానికి ముందు చేసిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకొని విచారణ జరపాలని, బాధ్యులుగా తేలిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వీసీకే పార్టీ నాయకులు ఆదినారాయణ మాట్లాడుతూ తౌషిక్ మృతి, మౌలాబి ఆత్మహత్య ఘటనలపై బాధ్యతారాహిత్యాన్ని గుర్తించి సంబంధిత అధికారుల పాత్రను తేల్చాలన్నారు. కాంగ్రెస్ నాయకులు మన్నం ప్రసన్నరాజు, జిల్లా అధ్యక్షులు షేక్ సైదా మాట్లాడుతూ బాలుడి మృతిపై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని, పాఠశాల యాజమాన్యం పాత్రపైనా విచారణ జరపాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సీహెచ్ వినోద్ మాట్లాడుతూ ఆరు నెలలుగా న్యాయం కోసం పోరాటం జరుగుతున్నా ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం ఆందోళనకరమన్నారు. విద్యార్థి సంఘాలను ఐక్యం చేసి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని తెలిపారు.

ఈ నెల 12న ఒంగోలు కలెక్టరేట్ ఎదుట జరిగే మహాధర్నాకు ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి విద్యార్థులు, దళిత, మైనారిటీ, కార్మిక, ప్రజా సంఘాలు, కాంగ్రెస్, వామపక్ష పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మందా కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. మహాధర్నా అనంతరం కూడా ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో ఐఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సుందరం, లోక్ సత్తా రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, లిబరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు చీటితోటి శోభన్ బాబు, హైకోర్టు న్యాయవాది సుభాని, ఎస్టి పిఐ నాయకులు అబ్దుల్ సత్తార్, అఖిల భారత రైతు కూలిసంఘ జిల్లా అధ్యక్షులు కె నాంచార్లు, పిఎల్ ఓ నాయకులు పద్మ, ఓపిడిఆర్ నాయకులు సిహెచ్ సుధాకర్, బిసి సంఘాల జెఏసి అధ్యక్షులు మిరియం శ్రీనివాసరావు, ముస్లిం మహిళా నాయకులు నాగూర్ బి, తౌషిక్ తండ్రి ఆలీ, పలు ముస్లిం మైనారిటీ, బిసి సంఘాల నాయకులు మాట్లాడుతూ మౌలబి కుటుంబంకు న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, వైసిపితో పాటు పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

గడప వద్దకే సంక్షేమం
లబ్ధిదారుల ఇంటికే ఎమ్మెల్యే ముత్తుముల





(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, అక్టోబర్ 1)

రాచర్ల మండలం యడవల్లి గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని వృద్ధులు, వికలాంగుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పెన్షన్లు అందజేశారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు సిఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సంక్షేమం కాగితాలకే పరిమితం కాకుండా లబ్ధిదారుల గడపకే చేరాలన్నదే కూటమి ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాచర్ల మండల కూటమి నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
గోకులం షెడ్ల నిర్మాణ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముత్తుముల





(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, అక్టోబర్ 1)

రాచర్ల మండలంలోని రంగారెడ్డిపల్లె గ్రామంలో వికసిత్ భారత్ గ్రామీణ్ పల్లె పండుగ 3.0 నిధులతో చేపట్టిన గోకులం షెడ్ నిర్మాణ పనులకు గురువారం తురక సుబ్బయ్య గోకులం షెడ్ వద్ద శంకుస్థాపన చేసి, స్వయంగా పార పట్టి నిర్మాణ పనులను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషక రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పనులను చేపడుతోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ పల్లె పండుగ 3.0 ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోందని పేర్కొన్నారు. రైతులకు, పశుపోషకులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటూ, గ్రామాల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాచర్ల మండల కూటమి నాయకులు, రైతులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ పాఠశాలలో చేరేందుకు
దరఖాస్తుల గడువు పొడిగింపు

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, అక్టోబర్ 1)

మండలంలోని జవహర్ నవోదయ పాఠశాలలో 2027 విద్యాసంవత్సరానికి గాను 9, 11 తరగతులలో చేరే విద్యార్థులకు సెలక్షన్ లిస్ట్ ల పరిమితిని సెప్టెంబర్ 30వ తేదీ నుండి అక్టోబర్ 15 వరకు దరఖాస్తు గడువు పొడిగించడం జరిగిందని ఆ పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తిగల విద్యార్థులు పెంచిన గడువు లోపు దరఖాస్తు చేసుకొని టెస్టులో పాల్గొనాలని ఆయన తెలియజేశారు.

జరుగుమల్లి ఇంటిగ్రేటెడ్ బాలికల వసతి గృహ ఘటన పై సమగ్ర విచారణ జరిపించాలి

బాలికల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలి
ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 1)

ప్రకాశం జిల్లా, జరుగుమల్లి మండలంలోని ఇంటిగ్రేటెడ్ బాలికల వసతి గృహంలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులకు సంబంధించిన తీవ్రమైన ఘటన ఆలస్యంగా వెలుగులో వచ్చింది. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. గురు వారం ఐద్వా జిల్లా కార్యాలయంలో ఆమె మీడియా తో మాట్లాడుతూ స్థానికుల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం, విద్యార్థినులను హాస్టల్‌కు వెలుపల ఉన్న ఒక వ్యక్తి వద్దకు పంపినట్లు ఆరోపణలు ఉన్నాయనీ అన్నారు. అక్కడికి వెళ్లిన అనంతరం ఒక విద్యార్థిని భయంతో బయటకు వచ్చి స్థానికుల సహాయంతో తన తల్లికి ఫోన్ చేసినట్లు, అనంతరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నట్లు సమాచారం తెలిపారు. మరో విద్యార్థిని అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రికి తరలించినట్లు కూడా తెలుస్తోందనీ అన్నారు. విద్యార్థినులను హాస్టల్ నుంచి బయటకు ఎవరు పంపించారు, ఏ పరిస్థితుల్లో వారు బయటకు వెళ్లాల్సి వచ్చింది, ఘటనకు బాధ్యులు ఎవరు అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు జరపాలనీ డిమాండ్ చేశారు. హాస్టల్‌లో బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండగా, విద్యార్థినులు హాస్టల్ వెలుపలికి వెళ్లే పరిస్థితి ఎలా ఏర్పడిందనే విషయాన్ని అధికారులు తేల్చాలనీ, వార్డెన్ పర్యవేక్షణ, హాస్టల్ నిర్వహణ, విద్యార్థినుల రాకపోకల నమోదు, భద్రతా చర్యలు తదితర అంశాలపై ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించాలన్నారు. ప్రస్తుత వార్డెన్‌పై గతంలో కూడా ఆరోపణలు వచ్చినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, గతంలో అధికారులు చేసిన తనిఖీలు, ఇచ్చిన హెచ్చరికలు, వాటిపై తీసుకున్న చర్యలను కూడా పరిశీలించాలని ఐద్వా కోరుతోంది. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. బాలికలపై జరిగినట్లు ఆరోపణలు వస్తున్న ఈ ఘటనను ఎట్టి పరిస్థితుల్లోనూ తేలికగా తీసుకోరాదు. బాధిత విద్యార్థినుల గోప్యతను కాపాడుతూ, వారికి అవసరమైన వైద్య, మానసిక, న్యాయ సహాయం అందించాలి. ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. ఇక పై ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రకాశం జిల్లా పరిధిలోని అన్ని బాలికల వసతి గృహాలను ఉన్నతాధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి, భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలి. విద్యార్థినుల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించినట్లు తేలితే సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. బాలికల భద్రత, విద్య, గౌరవాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వ అధికారుల పై ఉంది. అందువల్ల ప్రభుత్వం వెంటనే స్పందించి జరుగుమల్లి ఘటన పై సమగ్ర విచారణకు ఆదేశించి, నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని ఐద్వా డిమాండ్ చేస్తోందన్నారు. ఈ మీడియా సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు నెరుసుల మాలతి, జిల్లా కోశాధికారి బి రాజ్యలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి జి ఆదిలక్ష్మి, జిల్లా నాయకులు కె రాజేశ్వరి పాల్గొన్నారు.

బాయ్స్ హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీడీవో బి సురేష్





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 1)

ప్రకాశం జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం "ఒక విద్యా సంస్థకు – ఒక ప్రత్యేక అధికారి" కార్యక్రమంలో భాగంగా ఉలవపాడు బాయ్స్ హాస్టల్ ప్రత్యేక అధికారి ఉలవపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి సురేష్ గురువారం రాత్రి గం.6:45ల నుండి 8:30 గంటల వరకు బాయ్స్ హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం వారు విద్యార్థులకు అందజేసిన బెడ్‌షీట్లు, పెట్టెలు, స్వెటర్ మొదలగు సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం రాత్రి భోజనంలో పెట్టిన అన్నం, కూరలు విద్యార్థులకు అందిస్తున్న తీరును పరిశీలించారు. తదుపరి విద్యార్థులను కలిసి మెనూ ప్రకారం ఉదయం పాలు టిఫిన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు

మృత్యువుతో పోరాడిన పసిబిడ్డకు పునర్జన్మ
నెలరోజుల చికిత్సతో సంపూర్ణ ఆరోగ్యం

750 గ్రాముల బిడ్డను కాపాడిన సాయి వీణ హాస్పిటల్ వైద్యులు
తల్లిదండ్రులు వైద్యులకి కృతజ్ఞతలు
వైద్య సేవలు వినియోగించుకోవాలని డాక్టర్ ఎల్ సునీల్‌కుమార్ రెడ్డి పిలుపు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 1)

తక్కువ బరువుతో పుట్టిన బిడ్డకు సాయి వీణ తల్లి పిల్లల హాస్పిటల్ వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. నెలరోజుల పాటు చికిత్సను అందించి సంపూర్ణ ఆరోగ్యంతో బిడ్డను తల్లిదండ్రులకు అప్పగించారు. వైద్యం అందించిన సాయివీణ చిన్నపిల్లల వైద్యశాల యాజమాన్యానికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక 60 అడుగుల రోడ్ లోని సాయి వీణ మాతా,శిశు వైద్యశాలలో గురువారం జరిగిన పాత్రికేయులు సమావేశంలో సంబంధించిన వివరాలను చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎల్ సునీల్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కాపురం జిల్లా కొమరోలు మండలానికి చెందిన చార్టెడ్ అకౌంటెంట్ చెన్నం శెట్టి చిన కాశయ్య, బాదరమ్మ దంపతులు గతంలో వారికీ అమ్మాయి, అబ్బాయి ఉన్నారన్నారు. బాదరమ్మకు ఉమ్మ నీరు తప్పుగా ఉండడంతో 28 వారాలు 3వ బిడ్డకు సెప్టెంబర్ 1న జన్మనిచ్చిందన్నారు. సాధారణంగా పుట్టిన బిడ్డ 2.5 నుంచి 3 కిలోల బరువు ఉంటుందని,ఈ బాబు కేవలం 750 గ్రాముల బరువుతో పుట్టాడన్నారు. తల్లికి ఇన్ఫెక్షన్లు పోషకాహార లోపం ఇతర కారణాలతో బిడ్డలు బరువు తక్కువగా పుడతారని డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి వెల్లడించారు.దీంతో దంపతులు తమను సంప్రదించడంతో ఆసుపత్రిలో తన పర్యవేక్షణలో చికిత్సను అందించామన్నారు. ఎన్ ఐ సి యూ తో పాటు పది రోజులు పాటు వెంటిలేటర్ పై చికిత్స అందించామన్నారు. బరువు తక్కువగా ఉండడంతో పాటు ఇన్ఫెక్షన్లు సోకడంతో వాటిని జాగ్రత్తగా గమనిస్తూ చిన్నారికి చికిత్సను చేశామన్నారు. నేడు బాబు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నాడని అతన్ని తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. బరువు తక్కువ గా పుట్టిన బిడ్డలకు వైద్యం చేయించేందుకు గుంటూరు విజయవాడ వెళ్లాల్సిన అవసరం లేదని ఒంగోలు సాయి వీణ హాస్పిటల్ లో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. బరువు తక్కువ గా పుట్టిన బిడ్డలను 120 కిలో మీటర్ల దూరం ప్రయాణించే లకు కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సాయి వీణ హాస్పిటల్ యాజమాన్యానికి రుణపడి ఉంటాం
బాలుని తండ్రి చిన్న కాశయ్య

తక్కువ బరువుతో కనీసం ఊపిరి కూడా పీల్చుకోలేని తమ బాబు ను సంపూర్ణ ఆరోగ్యవంతుని చేసిన హాస్పిటల్ యాజమాన్యానికి రుణపడి ఉంటామని తండ్రి చిన్న కాశయ్య తెలిపారు. బిడ్డ చికిత్స విషయమై తన స్నేహితులు, పాలూరు వైద్యులను సంప్రదిస్తే సాయి వీణ హాస్పిటల్ కు సిఫారసు చేశారన్నారు. ఇక్కడికి వచ్చే సమయానికి బిడ్డ ఊపిరి తీసుకొని పరిస్థితి లేదని, 750 గ్రాముల బరువుతో పు ట్టడంతో తాము ఆశలు కోల్పోయామన్నారు. చిన్నపిల్లల వైద్యనిపులు డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నర్సింగ్ స్టాఫ్ బిడ్డకు మెరుగైన వైద్యం అందించి సంపూర్ణ ఆరోగ్యవంతునిగా అందించారన్నారు. వైద్య చికిత్స చేసిన డాక్టర్ సునీల్ కుమార్‌రెడ్డి, నర్సింగ్ స్టాఫ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో సాయి వీణ మాతా శిశు వైద్యశాల ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ సాయి వీణ, బాబు తల్లి బాదరమ్మ, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

చాగొల్లు ఇందిరా నగర్ కాలనీలో ఘనంగా పోషణ మాస ఉత్సవాలు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 1)

మండలంలోని వీరేపల్లి సెక్టార్‌లోని చాగొల్లు ఇందిరా నగర్ కాలనీ నందు గురువారం సిడిపిఓ డి మాధవిలత, ఆదేశాల మేరకు సూపర్వైజర్ కె రమాదేవి ఆధ్వర్యంలో పోషణ మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గర్భిణీలకు తల్లులకు పోషకాహారం గురించి అంగన్వాడీ సెంటర్లో ఇచ్చే బాలామృతం బాలసంజీవునికిట్లు ప్రోటీన్ ఫుడ్స్ పాలు గుడ్లు ఆకుకూరలు జెండా కి ఎన్ని రంగులు ఆ రంగుల వర్ణం ఉన్న ఫుడ్స్ గురించి ఆకుపచ్చని వర్ణంలో ఉన్న ఆకుకూరలుకూరగాయలు తెలుపు వర్ణంలో ఉండే పాలు గుడ్లు, ఫుడ్స్ గురించి క్యారెట్ కూరగాయలు గురించి తెలియజేశారు. ఆరు నెలలు నిండిన తర్వాత బిడ్డకు తినిపించాల్సిన ఆహారం గురించి, ఈమ్యునైజేషన్ గురించి, పిఎంఎంవై ప్రధానమంత్రి మాతృత్వ వందన పథకం గురించి, అంగన్వాడీ సెంటర్లో ఇచ్చే ఫుడ్స్ గురించి, తల్లులకు, 6 నెలలు నిండిన బిడ్డలకు సమతుల్యమైన ఆహారం, వివిధ రకాలలో ఎలా తినిపించాలి, మాంసాహారం, శాఖాహారం పిల్లలకి ఏ నెలలో ఏ రకాలుగా తినిపించాలి, ఎంత క్వాంటిటీలో తినిపించాలనీ తల్లులకు తెలియజేశారు. చక్కెర, ఉప్పు నూనెలు ఎక్కువ వాడకం వల్ల వచ్చే సమస్యల గురించి. గర్భవతిగా ఉన్నప్పటి నుంచి బిడ్డ రెండు సంవత్సరాలు నిండే వరకు వెయ్యి రోజులు తల్లి బిడ్డ సంరక్షణ గురించి తల్లులకి అవగాహన కల్పించారు. పోషణ మహా కార్యక్రమంలో అన్ని విషయాలలో పూర్తి సహకారాలు అందించినటువంటి అంగన్వాడి టీచర్ సిహెచ్ లలితని, 30 సంవత్సరాల నుండి సేవలందించిన అంగన్వాడి కార్యకర్త ఏ నాగమణిని స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, అందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

గురుకులం విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదవాలి
జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 1)

గురుకులం విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రధాన్యత ఇస్తుందని, విద్యార్థులు కూడా లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదవాలని మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అన్నారు. మండలంలోని రాయవరం గ్రామంలోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గురుకులం ఉన్నత పాఠశాల, కళాశాలలో గురువారం రాత్రి మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి విద్యార్థులకు పరుపుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గురుకుల విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు వారి విద్యాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఒక ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించేందుకు క్రమశిక్షణతో, పట్టుదలతో కష్టపడి పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మంచి మార్కులు సాధిస్తూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, సమాజం పట్ల బాధ్యతతో మెలగాలని తెలిపారు. భవిష్యత్తులో పైలట్లు, శాస్త్రవేత్తలు, కలెక్టర్లు, ఎస్పీలు, ఆస్ట్రోనాట్స్ వంటి ఉన్నత స్థానాలను అధిరోహించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సహించాలని సూచించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సాంఘీక, సంక్షేమ హాస్టల్లో కొన్ని వందల కోట్ల రూపాయల ఖర్చుతో మంచి భోజనం, బట్టలు, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. తొలుత జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీతతో కలిసి మెనూ, ఇతర సౌకర్యాల పై విద్యార్థినులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, తహసీల్దార్ చిరంజీవి, ఇతర గురుకుల పాఠశాల, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శరభ సమేత గండ బేరుండ మహాగణపతికి ఎమ్మెల్యే దామచర్ల పూజలు
అన్నసంతర్పణ ప్రారంభించిన దామచర్ల జనార్దన్‌రావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 1)

ఒంగోలు నగరంలోని 27వ డివిజన్ రాజా పానకాల రోడ్డు నాలుగోవ లైన్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ శరభ సమేత గండ బేరుండ మహాగణపతి స్వామి వారికి ఒంగోలు నియోజకవర్గ శాసనసభ్యులు దామచర్ల జనార్దన్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో తూము సుబ్బారావు, తూము రాజేష్, బండారు మదన్, శాండిల్య, వెంకటేశ్వరరెడ్డి, తూము వెంకటేశ్వర్లు, పప్పు శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరరావు, బోడపాటి వెంకట్, బాలకృష్ణ, వంశీకృష్ణ, హేమంత్ బాబు, ఉండవల్లి రాజేష్, పసుపులేటి మురళి, మన్నేపల్లి అనిల్, తదితరులు పాల్గొన్నారు.








ఇంటింటికీ పింఛన్ల పంపిణీ చేసిన దాదా

(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 1)



కంభం పంచాయతీ పరిధిలోని 54వ బూత్ పరిధిలో గురువారం పింఛన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు జుమ్మా మసీదు, చిన్న మసీదు, మార్కెట్, అమ్మవారి శాల పరిసర ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ ముస్లిం మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ వార్డు సభ్యులు అత్తర్ షేక్ హుస్సేన్ (దాదా) ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పింఛన్ లబ్ధిదారుల వివరాలను పరిశీలించి వారికి పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు పటాన్ నాగూర్ అలీఖాన్, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎం ఝాన్సీ రాణి, తదితరులు పాల్గొన్నారు.

సఖి వన్ స్టాప్ సెంటర్ భూమి పూజా కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 1)

మార్కాపురం: మహిళలు, బాలికలకు ఒకే చోట సమగ్ర సహాయ సేవలు అందించేందుకు రూ. 60 లక్షల తో ఏర్పాటు చేస్తున్న 'సఖి వన్ స్టాప్ సెంటర్' భవన నిర్మాణానికి గురువారం మార్కాపురంలోని జిల్లా ఆసుపత్రి ఆవరణలో భూమి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, బాలికలు వివిధ రకాల సమస్యలు, హింసకు గురైన సందర్భాల్లో వారికి తక్షణ సహాయం, రక్షణ, వైద్య సేవలు, న్యాయపరమైన సహాయం, కౌన్సెలింగ్ తదితర సేవలను ఒకే వేదిక ద్వారా అందించడమే సఖి వన్ స్టాప్ సెంటర్ ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత మాట్లాడుతూ మహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలు ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా సంబంధిత అధికారులను సంప్రదించి అవసరమైన సహాయం పొందాలని సూచించారు. సఖి కేంద్రం ద్వారా బాధితులకు అవసరమైన సేవలను సమన్వయంతో అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కేంద్రం నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దిష్ట సమయంలో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మహిళలకు భద్రత, రక్షణ కల్పించడంతో పాటు, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సఖి వన్ స్టాప్ సెంటర్ మార్కాపురం ప్రాంత మహిళలకు, బాలికలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇంచార్జి పీడీ పద్మావతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కూటమి లక్ష్యం



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, అక్టోబర్ 1)

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిస్ట్రిబ్యూషన్ కమిటీ 52 ప్రెసిడెంట్ పొద వీరయ్య చౌదరి అన్నారు.గురువారం మండలంలోని చిన్నగంజాం గ్రామంలో ఎంపిడిఓ కె ధనలక్ష్మి అధ్యక్షత నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ మండల కూటమి నాయకులు పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షుడు నరహరి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పొద వీరయ్యచౌదరి, ఎంపిడిఓ కె ధనలక్ష్మి, మండల తెదేపా అధ్యక్షులు నరహరి శ్రీనివాసరావు, చింతగుంపల్లి సొసైటీ డైరెక్టర్ సందు శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు చెరుకూరి రాఘవయ్య, బాపట్ల పార్లమెంట్ వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు మోటుమర్రి రామసుబ్బారావు, మాజీ సొసైటీ మాజీ అధ్యక్షులు తుమ్మలపెంట జయరావు, పార్టీ సీనియర్ నాయకులు బెల్లంకొండ రమేష్ బాబు, ధర్మవరపు యేసు నారాయణ, షేక్ జిలాని, కోటా శివరామకృష్ణ, షేక్ నబీషా, గంటా నరసింహారావు, గంట అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముక్తేశ్వరంలో పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు
అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతున్నాం

పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపు
రూ.20 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డుకు శంకుస్థాపన

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, అక్టోబర్ 1)

ఎన్టీఆర్ భరోసా పథకంలో భాగంగా లింగసముద్రం మండలం మాలకొండరాయుని పాలెం పంచాయితీలోని ముక్తేశ్వరం గ్రామంలో పలువురు వృద్ధులు, వికలాంగులకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం పల్లె పండుగ 3.0 ద్వారా ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించబోయే సీసీ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. గతంలో ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, స్మశానానికి కొత్తగా నిర్మించిన గ్రావెల్ రోడ్డును ఎమ్మెల్యే పరిశీలించారు. స్మశానానికి ఫెన్సింగ్, లోపల బోరు త్వరగా ఏర్పాటు చేయించాలని ఎంపీడీవోను ఆదేశించారు. త్వరలో ముక్తేశ్వరం నుంచి వలేటివారిపాలెం వరకు రూ.20 లక్షలతో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేయబోతున్నట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. తాగునీరు, వీధిలైట్ల సమస్యలను వారంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే విశ్వనాధపురం నుంచి గంగపాలెం మధ్య కొత్తగా తారురోడ్డు పనులు త్వరలో మొదలవుతాయని చెప్పారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో రోడ్ల పట్ల వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో అన్ని రోడ్లను బాగు చేశామన్నారు. నియోజకవర్గంలో మోస్ట్ సీనియర్ అని చెప్పుకుంటున్న కొందరు, వీటి గురించి ఎందుకు పట్టించుకోలేదని ఎమ్మెల్యే సూటిగా ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు గారు హామీ ఇచ్చినట్లుగా, అధికారంలోకి రాగానే వృద్ధులకు 4 వేలు, దివ్యాంగులకు 6వేలు, శాశ్వత దివ్యాంగులకు 15వేల చొప్పున పింఛన్ అందిస్తున్నారని చెప్పారు. పేదల సంతోషం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.





బ్యాంకుల ద్వారా అందుతున్న రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, చక్కగా వ్యాపారాలు నిర్వహించుకుని లాభాలు పొందడమే కాకుండా పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్నా, నేరుగా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే నాగేశ్వరరావు చెప్పారు. ఈసారి పంచాయితీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ కోటేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జ్ వంకాయలపాటి మాల్యాద్రి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు మాధవరపు వెంకట్రావు, గ్రామ నాయకులు పొంకం బ్రహ్మయ్య, రమణయ్య, డేగా శ్రీను, మల్లిబోయిన నరసింహారావు, కొల్లిబోయిన మనోజ్, నరాల బాలకృష్ణ, నలగట్ల శ్రీను, బొల్లినేని నాగేశ్వరరావు, ఉన్నం వీరాస్వామి, సోంపల్లి మనోహర్, రాజారపు మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.



రామాయపట్నం పల్లెపాలెంను నిర్వాసిత గ్రామంగా చేర్చాలి
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ డిమాండ్

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, అక్టోబర్ 1)

రామాయపట్నం లోని పల్లెపాలెం గ్రామాన్ని నిర్వాసితుల గ్రామాల జాబితాలో చేర్చి అక్కడున్న 400 మత్స్యకారుల కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ క్రింద పరిహారం అందించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యం రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామాయపట్నం పోర్టు పరిధిలోని నిర్వాసితుల గ్రామాల్లో సిఐటియు ప్రకాశం జిల్లా కమిటీ బృందం చేవూరు, కర్లపాలెం మొండివారిపాలెం, ఆవుల వారిపాలెం, సాలిపేట, రామాయపట్నం పల్లెపాలెంలలో గురువారం పర్యటించింది. ఈ పర్యటనలో భాగంగా రామాయపట్నం పల్లెపాలెంలో సభ జరిగింది. ఈ సభకు సిఐటియు జిల్లా నాయకులు జీవీబీ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సభలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం రమేష్, రామాయపట్నం పోర్టు నిర్వాసితుల సంఘం కన్వీనర్ జి వెంకటేశ్వర్లు, చేవూరు గ్రామ నాయకులు ఇరువూరి బ్రహ్మయ్యలు నిర్వాసితులను ఉద్దేశించి మాట్లాడారు. నాయకులు మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు నిర్మాణం చేపట్టకు ముందు పల్లెపాలెంకు సముద్రం 300 అడుగులు దూరంలో ఉండేదని,పోర్టు నిర్మాణం జరిగిన తర్వాత 30 అడుగులకే సముద్రం ముందుకు వచ్చిందని పేర్కొన్నారు. పల్లెపాలెంలోని ప్రజలు నిద్రాహారాలు మాని, భయభ్రాంతుల మధ్య జీవించాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. సముద్రం ప్రక్కనే ఉన్న ఎనిమిది జెల్లే ఫిష్ షెడ్లు సముద్రంలో మునిగిపోయినవని, రెండు రొయ్యల చెరువులు మునిగిపోయాయని, సముద్రం పక్కనే ఉన్న ఇండ్లు, చెట్లు సముద్రంలో కలిసిపోయినవని తెలిపారు. రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు జరుగుతుంటే శబ్ద కాలుష్యం, సముద్రం నుంచి వచ్చే ధ్వనులతో నివాసం ఉండటానికి వీలులేని పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. ఈపాటికే జిల్లా కలెక్టర్ ను, కందుకూరు సబ్ కలెక్టర్ ను, కందుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు ని కలసి సమస్యను వివరించినప్పటికీ ఈరోజుకి సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ఇప్పటికైనా రామాయపట్నం పల్లెపాలెం ను నిర్వాసిత గ్రామంగా ప్రకటించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద వారికి రావలసిన పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఉద్యమానికి సన్నద్ధం చేస్తామని హెచ్చరించారు. ప్రకాశం జిల్లాలో ప్రజలు ఎంతో పోరాడి సాధించుకున్న రామాయపట్నం పోర్టును 50 సంవత్సరాల పాటు ప్రైవేట్ సంస్థలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ, నిర్వాసితుల గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఈనెల 4న కందుకూరు పట్టణంలోని త్యాగరాజు స్వామి గుడి మందిరంలో జిల్లా సదస్సు ను నిర్వహిస్తున్నామని, ఈ సదస్సులో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నరసింగరావు, తో పాటు ఇతర నాయకులు పాల్గొని మాట్లాడుతారని, ఈ సదస్సుకు నిర్వాసిత గ్రామాలలో ప్రజలు, జిల్లా అభివృద్ధిని కాంక్షించే కార్మిక ప్రజా సంఘాల నాయకులు, పోర్టు ప్రైవేటీకరణను వ్యతిరేకించే ఆభ్యుదయ కాముకులు, ప్రజాస్వామ్యవాదులు ఈ సదస్సుకు హాజరుకావాలని సిఐటియు జిల్లా నాయకులు కోరారు. ఈ పర్యటనలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి. కల్పన, సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్ పల్లాపల్లి ఆంజనేయులు, సిఐటియు జిల్లా నాయకురాలు యు ఆదిలక్ష్మి, సురేష్,గుత్తి. మల్లికార్జున, ఎస్ నరసింహారావు తోపాటు కాపు ఆర్ సుధాకర్ రావు, టి పరిశుద్ధ రావు, ఆర్ రాములు, టి ప్రభావతమ్మ, సిహెచ్ సీతారావమ్మ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముందుకొచ్చిన సముద్రాన్ని, మునిగిపోయిన షెడ్లను చెట్లను పరిశీలించారు. పోర్టు నిర్వాసితుల కోసం ఇటీవల నిర్మించిన మొండి వారి పాలెం, ఆవులవారి పాలెం, సాలిపేట, కర్లపాలెం కాలనీలలో పర్యటించి వారి సమస్యలను తెలుసుకొని, ఈనెల 4న ఉదయం 10 గంటలకు కందుకూరు సదస్సుకు రమ్మని ఆహ్వానించారు.





అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 1)



9వ జాతీయ పోషణ మాసం సందర్భంగా కంభం మండలం కంభ 2 సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా



గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా చిన్నారులకు అందించే పోషకాహారం, గుడ్లు, పాలు తదితరాల ప్రాధాన్యతను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించి పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది వై. పద్మావతి , లలిత సులోమి, హెచ్ఎం అరుణ,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, హెల్పర్లు రహమత్, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అవ్వా తాతలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పండుగ



(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 1)

కంభం పట్టణంలోని అర్బన్ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సూచనతో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వార్డు సచివాలయ సిబ్బంది, యూనిట్ 10 ఇన్‌చార్జి సయ్యద్ నూరుల్లా ఖాద్రి, కంభం పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి జేడీ బాబు, టీడీపీ కార్యకర్తలు రాము, బాబు, తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరుపాడు ఎంపీపీ స్కూల్ నందు పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 1)

ఉలవపాడు మండలం కొల్లూరుపాడు గ్రామం ఎంపీపీ స్కూల్ నందు పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలలో చైర్‌పర్సన్‌గా దాసరి మౌనిక, వైస్ చైర్‌పర్సన్‌గా కె అపర్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం, మౌలిక వసతుల అభివృద్ధికి కమిటీ కృషి చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ ప్రభాకర్‌రావు, కోటు వీరయ్య, సొపాటి వంశీ, తదితరులు పాల్గొన్నారు

నేడు మార్కాపురం జిల్లాలో "స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు 2026" ప్రధానోత్సవం
స్వచ్ఛత యోధులకు అవార్డుల ప్రధానం
జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత
ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 1)

స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది నిర్వహించిన శ్రమదానం, పరిశుభ్రత సర్వేలో విశేష ప్రతిభ కనబరిచిన విజేతలకు అక్టోబర్ 2వ తేదీ సాయంత్రం 5 గంటలకు కంభం రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపం నందు "స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు 2026" వేడుకను జిల్లా స్థాయిలో ఘనంగా నిర్వహించనున్నట్లు మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. ప్రజా ప్రదేశాల్లో పరిశుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ఆర్ఆర్ఆర్ కేంద్రాల నిర్వహణ, వ్యర్థాల నిర్వహణలో విశిష్ట సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు ఈ పురస్కారాలు అందజేస్తున్నామని తెలియజేశారు. ఆగస్టు 22 నుండి సెప్టెంబర్ 28 వరకు నిర్వహించిన సమగ్ర సర్వే ఆధారంగా పారదర్శకంగా విజేతలను ఎంపిక చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరుకానున్నారు. మార్కాపురం జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేలు, మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తదితరులు హాజరవనున్నారని తెలిపారు. అక్టోబర్ 2 గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే ఈ ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా స్థాయిలో ఎంపికైన విజేతలకు కలెక్టర్ పురస్కారాలు, సన్మానం చేయనున్నారు. ఈ వేడుకకు జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, స్వచ్ఛ, సుస్థిర మార్కాపురం జిల్లా నిర్మాణంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత పిలుపునిచ్చారు.


కరేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్‌గా గొల్లపోతు మధుబాబు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 1)

ఉలవపాడు మండలం కరేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా గొల్లపోతు మధుబాబు, వైస్ చైర్మన్‌గా చిట్టా శివజ్యోతి ఎన్నికయ్యారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం, మౌలిక వసతుల అభివృద్ధికి కమిటీ కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నేలటూరి ఆదాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే చదువుపై శ్రద్ధ పెట్టి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదలతో చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో పాఠశాల విద్య ఎంతో కీలకమని, ఉపాధ్యాయులు అందించే విద్యను సద్వినియోగం చేసుకోవడంతో పాటు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా విద్యార్థులు ముందుకు సాగాలని ఆదాము సూచించారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి రంగాల్లోనూ ప్రతిభను పెంపొందించుకోవాలని అన్నారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులకు అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలంటే ప్రాథమిక స్థాయి నుంచే మంచి విద్యా పునాది ఏర్పరుచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి, లక్ష్యాన్ని నిర్ణయించుకుని దాని సాధన కోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాఠశాల అభివృద్ధిలో పాఠశాల నిర్వహణ కమిటీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థుల సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు పాఠశాలలో మౌలిక వసతుల మెరుగుదలకు కృషి చేయాలని సూచించారు. కొత్తగా ఎన్నికైన చైర్మన్ గొల్లపోతు మధుబాబు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి పనిచేస్తానని తెలిపారు. వైస్ చైర్మన్ చిట్టా శివజ్యోతి కూడా పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తే పాఠశాల అభివృద్ధికి ప్రధాన లక్ష్యంగా ఉండాలని, ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి మంచి పౌరుడిగా ఎదగాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇంచార్జి పోలు బోయిన శ్రీనివాసులు, మాజీ అధ్యక్షులు కన్నా ప్రసాద్, టీడీపీ నాయకులు మర్రిబోయిన వెంకయ్య, పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు బహూకరించిన ఎస్ఎంసి కమిటీ సభ్యులు



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, అక్టోబర్ 1)

మండలంలోని గానుగపెంట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథక పాఠశాలకు ఎస్ఎంసి కమిటీ సభ్యులు కొమ్ము పరిమళ 40 గ్లాసులు, కొమ్ము అంజలి 20 ప్లేట్లను విద్యార్థులకు బహూకరించారు. ఈ విధంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను కల్పిస్తూ, విద్యతో పాటు పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు సామాగ్రిని దాతలు సహకరించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా పాఠశాలను అన్నివిధాల అభివృద్ధి పదంలో నడిపిస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ ఎస్ఎంసి కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందయమని వారిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో దాతలు కొమ్ము పరిమళ, కొమ్ము అంజలి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
12 | 02.10.26 శుక్రవారం

స్థానిక సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు అందుకే పల్లెనిద్ర

జిల్లా కలెక్టర్ పిరాజాబాబు







(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, అక్టోబర్ 1)

స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, అందుకోసమే పల్లెనిద్ర కార్యక్రమం ద్వారా జిల్లా యంత్రాంగం మొత్తం మీ మధ్యకు వస్తుందని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. గురువారం ఆయన మద్దిపాడు మండలం ఇనమనమెల్లూరు గ్రామంలో నిర్వహించిన పల్లెనిద్ర కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్, జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారితో కలిసి ప్రజలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. స్థానికుల మంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ ప్రతి అర్జీని సీరియస్‌గా తీసుకుంటామని, మీ గ్రామంలోని త్రాగునీటి సమస్య పరిష్కారానికి సత్వరమే రూ.30 లక్షలతో పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని, ఆర్థికేతర సమస్యల పై అధికారులు తక్షణమే దృష్టి సారిస్తారని, ఆర్థికపరమైన సమస్యలను కూడా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో ప్రజలతో ముఖాముఖి చర్చించి వారి సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే ' పల్లెనిద్ర ' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మెరుగైన జీవనోపాధి కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ' మనమిత్ర ' వాట్సప్ సేవలు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ' కౌశలం ', విపత్తుల సమాచారాన్ని క్షణాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచే ' అవేర్ 2.0 ' ఆన్లైన్ పోర్టల్ గురించి స్వయంగా కలెక్టరే ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని గర్భిణులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. తల్లీబిడ్డ ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. అంగన్వాడీ, ఏఎన్ఎంల ద్వారా లభిస్తున్న సేవలను వినియోగించుకోవాలని, పోషకాహారం తీసుకుంటూ సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కాగా, వైద్యుల ద్వారా పొందుతున్న సేవలపై గర్భిణులు సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానికులు మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 1300 కుటుంబాలు ఉన్నాయని చెప్పారు. గుండ్లకమ్మ నుంచి వెళ్తున్న పైప్ లైన్ నుంచి తమ గ్రామానికి కనెక్షన్ కావాలని కోరారు. అదేవిధంగా తమ గ్రామంలోని చెరువుకు కూడా నీటిని మళ్ళించాలని అభ్యర్థించారు. గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. దళిత, గిరిజన కాలనీలకు శాశ్వత స్మశాన వాటిక కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమ గ్రామం నుంచి ఒంగోలుకు పండ్ల వ్యాపారం నిమిత్తం వెళ్తున్న రైతులకు మార్కెట్ వద్ద వసతులు కల్పించాలని స్థానికులు అభ్యర్థించారు. తమకు మత్స్యకార లైసెన్సులు ఇప్పించాలని పల్లెకారులు విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులు ప్రస్తావించిన సమస్యలను కలెక్టర్ ఓపికతో విన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి తక్షణమే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆర్థికేతర సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. రెవెన్యూ సమస్యలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఈ సందర్భంగా రూ.6.50 కోట్ల విలువైన బ్యాంకు చెక్కును కలెక్టర్, ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్ అందించారు. ఈ రుణాలను మెరుగైన జీవనోపాధికి వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

రూ.3 కోట్లతో రోడ్డు

ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం మొత్తం ప్రజల వద్దకు రావడం హర్షనీయమన్నారు. గ్రామస్తులు ప్రస్తావించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వ్యక్తిగతంగా తాను కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. ఏడుగుండ్లపాడు – ఇనమనమెల్లూరు రోడ్డును రూ.3 కోట్లతో నిర్మించేందుకు కలెక్టర్ హామీ ఇవ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల పనులను డిసెంబర్ నుంచి చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ అనుపమ, స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సచివాలయాల జిల్లా అధికారి వెంకటేశ్వరరావు, ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య చైర్మన్ జయంతి బాబు, తదితరులు పాల్గొన్నారు. దీనికి ముందుగా మండలంలోని అన్ని గ్రామాల్లో జిల్లా స్థాయి అధికారులు పర్యటించి స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పల్లెనిద్ర కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాగా, ఈ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు తక్షణమే దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఎస్సీ కాలనీలో పర్యటన

పల్లెనిద్ర కార్యక్రమానికి ముందుగా స్థానిక ఎస్సీ కాలనీలో కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటించి ప్రజలతో ప్రత్యేకంగా మాట్లాడారు. వివిజి రామ్‌జీ పథకం కింద లభిస్తున్న ఉపాధి అవకాశాలు, వివిధ సంక్షేమ కార్యక్రమాలు కింద అందుతున్న ప్రభుత్వ ప్రయోజనాలపై కలెక్టర్ ఆరా తీశారు. పిల్లలను పాఠశాలకు పంపుతున్న తీరు, డ్రాపౌట్స్ గురించి మాట్లాడారు. గ్రామంలోని స్కూల్ కు ప్రహరీ గోడ కావాలని, టీచర్లను పూర్తిస్థాయిలో నియమించాలని స్థానికులు కోరారు. దీని పై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తాము తీసుకునే రుణాలను జీవనోపాధి పెంచుకునేందుకు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. స్థానికులకు ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

మండల తెదేపా నూతన అధ్యక్షుడుకి ఘన సన్మానం
ఏలూరి ఆశీస్సులతో పార్టీ పటిష్టతకు కృషి





(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, అక్టోబర్ 1)

మండలంలోని సోపిరాల నందు గురువారం ఉదయం మండల టిడిపి నూతన అధ్యక్షుడు నరహరి శ్రీనివాసరావు ఎన్నికైన నేడు అమెరికా నుండి స్వగ్రామం వచ్చిన సందర్భంగా గత మండల అధ్యక్షుడు అధ్వర్యంలో మండలంలోని టిడిపి నాయకులు,కార్యకర్తలు నరహరి శ్రీనివాసరావును పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సంబశివరావుకు కృతజ్ఞతలు తెలియాజేస్తు నరహరి శ్రీనివాసరావు ఏలూరి చిత్రంలో కూడిన భారీ కేక్ ను కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు సరహరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తనను మండల అధ్యక్షుడుగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఏలూరి దివ్య ఆశీస్సులతో మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడుగా పార్టీ పటిష్టతకు పాటుపడునున్నాట్లు తెలిపారు. ఇ కార్యక్రమంలో గత మండల అధ్యక్షుడు పొద వీరయ్య చౌదరి, సందు శ్రీనివాసరావు ,చెరుకూరి రాఘవయ్య, మోటుమర్రి రామసుబ్బారావు, తుమ్మలపెంట జయరావు, బెల్లంకొండ రమేష్ బాబు, ధర్మవరపు యేసు నారాయణ, షేక్ జిలాని, కోటా శివరామకృష్ణ, షేక్ నబీషా, గంటా నరసింహారావు, గంట అనిల్ కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

చీమకుర్తి గ్రానైట్ క్వారీలో తప్పిన పెను ప్రమాదం





(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, అక్టోబర్ 1)

చీమకుర్తిలో మెడ్‌వెస్ట్ గ్రానైట్ క్వారీలో తృటిలో పెను ప్రమాదం తప్పిందని ఒంగోలు డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే ఆర్ఎల్‌పురం పంచాయతీ పరిధిలోని మెడ్‌వెస్ట్ గ్రానైట్ క్వారీలో మట్టితో కలిపి గ్రానైట్ లేయర్స్, ర్యాంపు ఒక్కసారిగా విరిగిపడ్డాయి. అయితే సాయంత్రం 5 గంటలకే కార్మికుల షిఫ్ట్ సమయం ముగియడంతో పెను ముప్పు తప్పిందన్నారు. నిబంధనల ప్రకారం సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు బ్లాస్టింగ్ సమయం కావడంతో, ఆ సమయంలో క్వారీ లోపల ఎవరూ లేకపోవడం పెద్ద ఊరటనిచ్చిందని డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. పని ముగించుకుని కార్మికులంతా బయటకు వచ్చి ర్యాంప్ దగ్గర వేచి ఉండటంతో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని, డ్యూటీలో ఉన్న కార్మికులందరు క్షేమంగా ఉన్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. క్వారీ నార్త్ ఈస్ట్ కార్నర్‌లో సహజసిద్ధంగానే మట్టి జారిపడిందని డీఎస్పీ ప్రాథమికంగా వెల్లడించారు. ఆయనతో పాటు రూరల్ సిఐ, ట్రాఫిక్ సిఐ, పలువురు ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

జడ్పీహెచ్ఎస్ భీమవరంలో ఏకగ్రీవంగా ఎస్ఎంసి ఎన్నికలు
ఎస్ఎంసి చైర్మన్‌గా జి శివాజీ



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 1)

మండలంలోని భీమవరం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం చందర్లే గౌరవనీయులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి సుబ్బారావు ఎస్ఎంసి ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు 100 మందికి పైగా హాజరయ్యారు. వీరిలో ఎస్ఎంసి చైర్మన్‌గా భీమవరం గ్రామానికి చెందిన గోసు శివాజీ, వైస్ చైర్మన్‌గా కృష్ణాపురానికి చెందిన కాకు విజయ ఎంపిక కాగా మరో 13 మందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం ప్రధానోపాధ్యాయులు బండి సుబ్బారావు కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ శివాజీ మాట్లాడుతూ తనను ఎంపిక చేసినందుకు విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు చెప్పడంతో పాటు పాఠశాల అభివృద్ధికి తన శక్తి మేర పాటుపడతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివరావు, అంకయ్య, శ్రీధర్, మస్తాన్‌వలి, చిట్టిబాబు, హేమలత, సిబ్బంది హనుమంతరావు, గ్రామ పెద్దలు, పాఠశాల శ్రేయోభిలాషులు పలువురు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని మేడికొండ భాస్కర్ పర్యవేక్షించారు.

మాజీ ఎంపీటీసీ పద్మావతి మృతి



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, అక్టోబర్ 1)

సోపిరాల గ్రామానికి చెందిన చినగంజాం ఎత్తిపోతల పథకం మాజీ అధ్యక్షులు, దివంగత నున్న సత్యనారాయణ సతీమణి మాజీ ఎంపీటీసీ నున్న పద్మావతి (85) గురువారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె 1994 సంవత్సరంలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికలలో చిన్నగంజాం ఎంపీటీసీగా విజయం సాధించి,1999 వరకు ప్రజలకు తమ సేవలను అందించారు. సత్యనారాయణ, పద్మావతిలకు ముగ్గురు కుమారులు విశ్రాంత ఏఎస్ఐ సాంబశివరావు, సత్యం హై స్కూల్ ప్రిన్సిపల్ హరనాథ్‌బాబు, వెంకట సుబ్బారావు, కుమార్తె లీల, హైమావతిలు ఉన్నారు. నున్న పద్మావతి మృతి పట్ల గ్రామ పెద్దలు, ప్రముఖులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసారు.

మాచర్ల ప్రజలు పాలిట మహాదేవుడు చంద్రబాబు

ఏడాదిలో తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం
షెడ్యూల్ ప్రకటించి మరి వరికపూడిశెల పూర్తి చేస్తాం
స్థానిక ఎన్నికల్లో రెచ్చిపోతే తోకలు కత్తిరిస్తాం
ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 1)

పల్నాడు జిల్లాలో అత్యంత వెనుకబడిన మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ ఈ ప్రాంత ప్రజల పాలిట మహాదేవుడులా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలుస్తున్నారని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఉద్ఘాటించారు. గురువారం పట్టణంలో స్థానిక శ్రీనివాస్ మహల్ సెంటర్ నందు (హైబ్రిడ్ యాన్యుటీ మోడ్) విధానంలో రూ.36 కోట్ల నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీ, ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి, పైలాన్ ఆవిష్కరించారు.

ఏడాదిలో తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం
ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు

వచ్చే ఏడాది నాటికి మాచర్ల నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం చూపుతామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్, అమృత్ స్కీం ద్వారా రూ.1000 కోట్లతో తాగునీటి వాటర్ గ్రిడ్స్ ను నిర్మిస్తున్నామన్నారు. హ్యామ్ విధానంలో మాచర్ల మున్సిపాలిటీ పరిధిలో సెంటర్ డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్లు, డ్రైన్లు, పార్కులో వంటి పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. త్వరలో వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మాణానికి షెడ్యూల్ ప్రకటించి, పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

నాలుగు సార్లు గెలిచి ఏం పీకావ్?
ఎమ్మెల్యే జూలకంటి

నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచాను అని చెప్పుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి నియోజకవర్గం అభివృద్ధి విషయంలో ఏం పీకారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా ఉండి అరాచకం, రౌడీయిజం చేస్తున్నప్పుడే, ఎదిరించి ప్రజలు, పార్టీ శ్రేణులు తనను గెలిపించారన్న విషయాన్ని రామకృష్ణారెడ్డి గుర్తు పెట్టుకోవాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో అలజడులు సృష్టించాలని చూస్తే తోకలు కత్తిరిస్తామని, చట్ట ప్రకారం తగిన మూల్యం చెల్లించుకుంటారని వైసీపీ నాయకులను ఉద్దేశించి హెచ్చరించారు. పిన్నెల్లి సోదర్లు మాచర్లను రక్తసిక్తం చేసి, నమ్ముకున్న నాయకుల గొంతులు కోసి, కేసుల్లో ఇరికించి, వారిని బానిసలుగా మార్చుకున్నారని ఆరోపించారు. మీ కుటుంబాలకు 30 సంవత్సరాలు ఊడిగం చేసిన భాస్కర్ రెడ్డి కుమారుడు చెన్నారెడ్డి ఊపిరి తీసింది మీరు కాదా అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మురళీకృష్ణ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి గబ్రూ నాయక్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, కూటమి పార్టీల నాయకులు ధారునాయక్, మంజూలరెడ్డి, యాగంటి మల్లికార్జునరావు, నల్లపాటి రాము, కజ్జంసైదయ్య, రాజబోయిన మధు, సాతులూరి కుమార్, కొమెర దుర్గారావు, యెనుముల కేశవరెడ్డి, మాచర్ల వాసు, మదార్ సాహెబ్, బృంగా రమణరావు, మున్నాం రాంబాబు, మద్దిగపు వెంకటరామిరెడ్డి, మున్నా రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com